E-KABURU

# ఈ-కబురు

24-02-2025 సోమవారం హైదరాబాద్ ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

www.ekaburu.com

ఛాన్స్ వస్తే ముద్దు సీన్స్ చేస్తా

6లో







# యాదగిరిగుట్టలో బంగారు గోపురం ఆవిష్కరణ

స్వామివారికి అంకితమిచ్చిన సీఎం రేవంత్ దంపతులు

పంచకుండాత్మక మహా పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం

స్వర్ణమయ పంచతల విమాన గోపురం వద్ద పూజలు

వైభవంగా బంగారు గోపుర సంప్రోక్షణ మహోత్సవం

**హైదరాబాద్, ఈ-కబురు:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం 11.54 గంటలకు మూలా నక్షత్రం, వృషభ లగ్నం, పుష్కర అంశంలో స్వామివారికి స్వర్ణ గోపురాన్ని సీఎం రేవంత్‌రెడ్డి భక్తులకు అంకితం చేశారు. ఆలయంలో మహా కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన స్వర్ణ గోపురాన్ని సీఎం ప్రారంభించారు.

**సీఎం దంపతులు ప్రత్యేక పూజలు..**

అంతకుముందు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పంచకుండాత్మక యాగం జరిగిన యాగస్థలికి చేరుకొని మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అంతరాలయం మాడవీధుల్లోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వామనామలై పీఠాధిపతి సూచనల మేరకు సీఎం దంపతులు స్వర్ణమయ పంచతల విమాన గోపురం వద్ద ప్రత్యేకంగా పూజలు చేశారు. అక్కడి నుంచి ఉత్తర రాజగోపురం నుంచి నేరుగా స్వర్ణ గోపురం పైకి చేరుకున్నారు. మహా సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం

మిగతా 2లో

# ప్రజల గొంతుకను వినిపిద్దాం

ఆకాంక్షలను చట్టసభల్లో చర్చిద్దాం

మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి

ప్రతి శాసన సభ్యుడు చర్చల్లో పాల్గొనాలి

శాసనసభ సంప్రదాయాన్ని కాపాడాలి

సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పార్టీ కార్యాలయంలో శాసనసభాపక్షం సమావేశం

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నేటి నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



**అమరావతి, ఈ-కబురు:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరిగింది. ఆదివారం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, పార్టీ విధానాలను జనసేన ఎమ్మెల్యేలకు పవన్ వివరించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం చట్టసభల్లో తన అనుభవాలను సీనియర్ ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్‌తోపాటు కందుల దుర్గేష్ తోటి ఎమ్మెల్యేలతో పంచుకున్నారు.

**వైసీపీ భాష వద్దు..**

ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపిద్దామని పార్టీ ఎమ్మెల్యేలకు

మిగతా 2లో



## 92 శాతం మంది హాజరు..

సజావుగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష

92,250 మంది అభ్యర్థులు దరఖాస్తు

86,459 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

2లో

## కొత్త లిక్కర్ బ్రాండ్లకు ఆహ్వానం

తెలంగాణ ప్రభుత్వం ఆమోదం

కొత్త కంపెనీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విదేశీ, దేశీయ లిక్కర్, బీర్ కంపెనీలకు అవకాశం

ఎలాంటి ఆరోపణలు లేవని సెల్ఫ్ సర్టిఫికేషన్ జతపరచాలి

2లో



## శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీకి 40 నిమిషాలే

శరవేగంగా సర్వే పనులు

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

క్షేత్రస్థాయిలో పనులు పరిశీలన

అధికారులకు పలు సూచనలు



2లో



## అభయహస్తం మొండి హస్తం

14 నెలల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు

బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం లేదు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

ఆదిలాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

2లో



## ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఆతిశీ

తొలి మహిళ ఎన్నికకావడం ఇదే మొదటిసారి

లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక

పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా సేవలు

విపక్ష నేత, మాజీ సీఎం ఆతిశీ

2లో



## ఏఐలో దేశం మరింత ముందుకెళ్లాలి

చంద్రయాన్ విజయం దేశానికి ఎంతో గర్వకారణం

అంతరిక్ష రంగంపై యువత ఆసక్తి చూపాలి

కృత్రిమ మేధ రంగాన్ని ప్రశంసించిన ప్రపంచం

మన్‌కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

తెలంగాణ టీచర్‌కు మోదీ ప్రశంసలు

2లో

# భూ తగాదాతోనే హత్య..

వీడిన రాజలింగమూర్తి హత్యకేసు మిస్టరీ

హత్యలో పదిమంది నిందితుల గుర్తింపు

పోలీసుల అదుపులో ఏడుగురు

ఏ1గా రేణికుంట్ల సంజీవ, ఏ2గా పింగిలి హేమంత్, ఏ8గా కొత్త హరిబాబు

వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ

2లో



# ఏఐలో దేశం మరింత ముందుకెళ్లాలి

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో ఈ సాంకేతికతను వినియోగించుకొని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ వినియోగం గురించి ప్రస్తావించారు. తెలంగాణలోని ఓ ఉపాధ్యాయుడి కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు.

**చంద్రయాన్ విజయం దేశానికే గర్వకారణం..**

ఇస్రో 100వ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేయడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. అంతరిక్షశాస్త్ర సరిహద్దులను అధిగమించాలనే దేశ బలమైన సంకల్పానికి ఇది నిదర్శనమని తెలిపారు. గత పదేళ్లలో దాదాపు 460 ఉపగ్రహాలను లాంచ్ చేసినట్లు తెలిపారు. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు. అంతరిక్ష రంగంపై యువత కూడా ఆసక్తి చూపుతోందని గుర్తుచేశారు. ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరగడం అనేది ఇటీవల సాధించిన విజయాల్లో ఒకటన్నారు.

**ఆదిలాబాద్ టీచర్‌కు ప్రశంసలు..**

ఇటీవల ఏఐ సదస్సులో పాల్గొనేందుకు పారిస్‌కు వెళ్లినట్లు చెప్పారు. కృత్రిమ మేధ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించిందని కొనియాడారు. తాజాగా తెలంగాణ ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ గిరిజన భాషలను పరిరక్షించడంలో తమకు సాయం చేశారని, ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికే అంకితం చేస్తామన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగం రూపకల్పనలో మహిళల పాత్ర గురించి ఆయన కొనియాడారు.

**క్యాన్సర్‌కు కారణమయ్యే వాటికి దూరంగా ఉండాలి..**

ప్రజలు క్యాన్సర్‌కు కారణమయ్యే సిగరెట్, బీడీ, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మధ్యప్రదేశ్‌లోని ఛత్తార్‌పూర్‌లో భాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చి సెంటర్‌కు



శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం తనకు ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిందన్నారు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ మంత్రంపై దృష్టిసారించానన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళా దేశ ఐక్యతకు చిహ్నంగా భావితరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. కోట్లాది మంది తరలి వస్తున్న మహా కుంభమేళాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ప్రధాని ప్రశంసించారు.

**బానిస మనస్తత్వం కలిగినవారు ప్రమాదకరం**

భారతదేశ మత, సాంస్కృతిక సంప్రదాయాలను వ్యతిరేకిస్తున్నవారిపై ప్రధాని విమర్శలు గుప్పించారు. ఇటీవల కాలంలో ప్రజల్ని విభజించే నేతల గుంపును చూస్తున్నామని, అనేక సార్లు విదేశీ శక్తులు సైతం ఈ వ్యక్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా దేశాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. హిందూ విశ్వాసాన్ని ద్వేషించే వ్యక్తులు శతాబ్దాలుగా ఏదో ఒక దశలో ఉంటున్నారని పేర్కొన్నారు. బానిస మనస్తత్వం కలిగిన వ్యక్తులు మన విశ్వాసాలు, నమ్మకాలు, ఆలయాలు, మతం, సంస్కృతి, సూత్రాలపై దాడి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాల కోసం పదెకరాల్లో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని ధీరేంద్ర శాస్త్రి సంకల్పించడం గొప్ప విషయమన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో క్యాన్సర్ నియంత్రణకు పలు ప్రకటనలు చేశామన్నారు. క్యాన్సర్ ఔషధాలు మరింత చౌకగా లభించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. రాబోయే మూడేళ్లలో దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లాలో క్యాన్సర్ డేకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

## మొదటి పేజి తరువాయి

### యాదగిరిగుట్టలో బంగారు గోపురం ఆవిష్కరణ

త్రితల రాజ గోపురం నుంచి ఆలయంలోకి చేరుకున్నారు. ఆయన వెంట సీఎస్ శాంతకుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కరరావు తదితరులు ఉన్నారు.

**మామూలు గోపురం కాదు..**

స్వర్ణ విమాన గోపురం ఎత్తు 50.5 అడుగులు. దీనికి పూర్తిగా బంగారంతో తాపడం చేశారు. ఇందుకు 68 కేజీల బంగారాన్ని వాడారు. ఇందుకు రూ.3.90 కోట్లు ఖర్చు అయ్యింది. అలాగే గోల్డ్ ప్లేట్ తయారీ, ఏర్పాటు కోసం మరో రూ.8కోట్లు ఖర్చు చేశారు. చెన్నైకి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీ పనులు చేపట్టింది.

**బీఆర్ఎస్ హయాంలో..**

లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. కానీ, బంగారు విమాన గోపురాన్ని ఏర్పాటు చేయలేదు. 2021 నాటికి గోపురం తాపడానికి 125 కేజీల బంగారం అవసరమని అప్పటి ప్రభుత్వం అనుకుంది. కానీ, అంచనాలు దాదాపు డబుల్ ఉన్నట్లైంది. ఇప్పుడు 68 కేజీలతోనే తాపడం పూర్తయింది. బంగారు గోపురం అయ్యే వరకూ.. భక్తుల్లో కొంత అసంతృప్తి నెలకొంది. ఇప్పుడు స్వర్ణ గోపురం కారణంగా.. యాదగిరి గుట్టను చూస్తే.. తిరుమల శ్రీవారి ఆలయాన్ని చూసినట్లే ఉందని భక్తులు అంటున్నారు.

## కొత్త లిక్కర్ బ్రాండ్లకు ఆహ్వానం

**హైదరాబాద్, ఈ-కబురు:** మందుబాబులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) కొత్త లిక్కర్ బ్రాండ్స్‌ను ఆహ్వానించడానికి అవసరమైన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ఆదేశించిన రీతిలో కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. తెలంగాణలో లేని విదేశీ దేశీయ లిక్కర్ బీర్ కంపెనీలు తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్మకాలు జరుపుకోవడానికి కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు.

**సెల్ఫ్ సర్టిఫికేషన్ జతపరచాలి..**

టీజీబీసీఎల్‌లో రిజిస్టర్ కానీ కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలపై నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవని నిర్ధారణ సర్టిఫికేషన్ పత్రం దరఖాస్తులో జతపరచాలని కోరింది. తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇటీవల టీజీబీసీఎల్ కొందరికి అనుమతులు ఇవ్వడం జరిగింది.

**కొత్త కంపెనీలపై పలు ఆరోపణలు..**

కొత్త కంపెనీలపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన కొత్త బ్రాండ్లను నిలిపివేశారు. తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల ఆహ్వానానికి కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. కొత్త దరఖాస్తులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటన ఇవ్వాలని ప్రభుత్వం టీజీబీసీలకు నిర్దేశించింది. టీజీబీసీఎల్ తెలంగాణలో రిజిస్టర్ కానీ కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి ప్రకటన జారీ చేసింది.

## శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీకి 40 నిమిషాలే

**హైదరాబాద్, ఈ-కబురు:** ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్?కు సంబంధించిన సర్వే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు కొనసాగుతున్న మెట్రో సర్వే పనులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్? వరుసలో నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న సీఎం రేవంత్ దార్శనికత దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.

**ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత గ్రీన్ సిటీగా..**

ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత గ్రీన్ సిటీగా ప్రపంచంలోనే అద్భుత నగరాల సరసన చేరాలన్నది సీఎం సంకల్పమని పేర్కొన్నారు. అందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైలు సంస్థ హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రో రైలు విస్తరణ ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. దాదాపు 15 వేల ఎకరాల్లో విస్తరించనున్న ఫ్యూచర్ సిటీని కాలుష్య రహిత నగరంగా రూపొందించడంతోపాటు అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన ఈ గ్రీన్ కారిడార్ కీలక పాత్ర పోషిస్తుందని ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. ఎయిర్ పోర్ట్ నుంచి మీర్ ఖాన్ పేట్?లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీ కోసం జరుగుతున్న సర్వే పనులను ఎన్వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీపీఆర్ కోసం జరుగుతున్న సర్వే పనులపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలకు అనుగుణంగా బహదూర్‌గూడలో 15వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండలలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**మార్చి వరకు పూర్తి..**

వైఎస్ఆర్ సీఎంగా ఓఆర్ఆర్ నిర్మిస్తున్నప్పుడు ఓఆర్ఆర్?లో అంతర్భాగంగా భవిష్యత్?లో నిర్మించబోయే మెట్రోకి తగినంత స్థలాన్ని కేటాయించాలన్న అప్పటి తన ప్రతిపాదనను వైఎస్ఆర్ అంగీకరించి ఓఆర్ఆర్?లో 20 మీటర్లు మెట్రోకి కేటాయించారని ఎన్వీఎస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. అప్పట్లో అనేక మంది ఓఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితలకే పరిమితమవుతాయని, అవి ఆచరణ సాధ్యం కాదని అపహాస్యం చేసినా, ప్రస్తుతం ఓఆర్ఆర్, మెట్రో రెండూ కూడా కార్యరూపం దాల్చాయని అయన పేర్కొన్నారు. వీటివల్ల హైదరాబాద్ ఒక అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు. నార్త్ సిటీలోని మేడ్చల్, శామీర్ పేట్ కారిడార్లతో పాటు, ఈ ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్ కూడా మార్చి నెలాఖరుకు పూర్తిచేసి, ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి వీటిని సమర్పిస్తామని తెలిపారు.

## 92 శాతం మంది హాజరు..

**అమరావతి, ఈ-కబురు:** గ్రూప్-2 పరీక్షలు సజావుగా ముగిశాయని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తెలిపింది. ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 92,250 మంది అభ్యర్థుల్లో 86,459 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా.. వారిలో 92శాతం మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

**ప్రభుత్వం సూచించినా యథావిధిగా..**

గ్రూప్-2 ప్రధాన పరీక్షను వాయిదా వేయాలని కూటమి ప్రభుత్వం సూచించినా ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాత్రం యథావిధిగా పరీక్ష నిర్వహించింది. పరీక్ష నిర్వహణ అభ్యర్థులకు శ్రేయస్కరం కాదని, హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సినందున వాయిదా వేయాలని ఏపీపీఎస్సీ కార్యదర్శికి సాధారణ పరిపాలన శాఖ లేఖ రాసింది. పరీక్ష రాసే అభ్యర్థులు డిగ్రీ పూర్తిచేసిన వారని, వాయిదా వేస్తే అది శాసనమండలి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఏపీపీఎస్సీ కార్యదర్శి శనివారం సాయంత్రం ప్రభుత్వానికి లేఖరాశారు.

## భూ తగాదాతోనే హత్య..

**జయశంకర్ భూపాలపల్లి, ఈ-కబురు:** తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో చిక్కుముడి వీడింది. కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేశారు. ఆదివారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మీడియా సమావేశంలో మాట్లాడారు. భూ వివాదాలే రాజలింగమూర్తి హత్యకు కారణంగా నిర్ధారించారు. నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు.

**హత్య కేసులో ఏడుగురు అరెస్టు..**

మీడియా సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి నిందితుల పేర్లు వెల్లడించారు. ఏ1 రేణికుంట్ల సంజీవ్ (36), ఏ2 పింగిలి సీమంత్ (22), ఏ3 మోరె కుమార్ (35), ఏ4 కొత్తూరి కుమార్ (38), ఏ5 రేణికుంట్ల కొమురయ్య (60), ఏ6 దాసరపు కృష్ణ (45), ఏ7 రేణికుంట్ల సాంబయ్య (56) ఉన్నారు.

**పరారీలో ఉన్న నిందితులు..**

ఏ8 కొత్త హరిబాబు-మాజీ వైస్ చైర్మన్ (బీఆర్ఎస్), ఏ9 పుల్ల నరేష్ తదితరులు పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. నిందితుల నుంచి 2 కత్తులు, 2 రాడ్లు , 5 బైక్‌లు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నలుగురు కలిసి హత్య చేయగా, ఇద్దరు రెక్కీలో పాల్గొన్నారని మిగతా వారు వాళ్లతో అటాచ్‌లో ఉన్నారన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఆతిశీ

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మాజీ సీఎం ఆతిశీని ఆప్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆమె పేరును ప్రతిపాదించగా, మిగతావారంతా మద్దతు పలికారు. ఢిల్లీలో ప్రతిపక్ష నేతగా ఒక మహిళ ఎన్నికకావడం ఇదే మొదటిసారి. అసెంబ్లీ తొలి సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించారు. ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సమావేశానికి హాజరయ్యారు.

**పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా సేవలు..**

అనంతరం ఆప్ నేత గోపాల్ రాయ్ మీడియాతో మాట్లాడారు. లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఆతిశీని ఏకగ్రీవంగా నిర్ణయించామని, పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా ఆమె సేవలందించారని ప్రశంసించారు. ఆరోగ్యకరమైన ప్రతిపక్షంగా ఆప్ తన బాధ్యతలను నెరవేరుస్తుందని చెప్పారు.

## అభయహస్తం మొండి హస్తం

**ఆదిలాబాద్, ఈ-కబురు:** బీసీ రిజర్వేషన్లకు బీజేపీ పూర్తిగా మద్దతు ఇస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఆయన ఆదిలాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ అవసరం లేదన్నారు. కులగణనకు తాము అడ్డుకుంటామనేది అవాస్తమన్నారు. కులగణన సక్రమంగా జరుగలేదని బీసీ సంఘాలే అంటున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభయహస్తం మొండి హస్తంగా మారిపోయిందని విమర్శించారు. రోజూ ఓ ప్రకటన ఇవ్వడం తప్ప.. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణలో సమస్యలు పరిష్కారం కావడం లేదర్నారు.

# ప్రజల గొంతుకను వినిపిద్దాం

మొదటి పేజి తరువాయి


పవన్పిలుపు నిచ్చారు. ప్రజల సమస్యలను, ఆకాంక్షలను చట్టసభల్లో చర్చిద్దామని సూచించారు. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలన్నారు. వైసీపీ భాష వద్దని జనసేన ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు. పార్టీ తరఫున ఎన్నికైన ప్రతి శాసన సభ్యుడు, మండలి సభ్యులు చర్చల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శాసనసభ సంప్రదాయం, మర్యాదను కాపాడుతూ హుందాగా ముందుకు వెళ్లాలన్నారు. చట్ట సభల్లో ఎంత విలువైన చర్చలు జరిగేవో ఒకసారి అందరూ పరిశీలించాలని, ఎప్పటికప్పుడు సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకొని చర్చల్లో పాల్గొనాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన పిలుపునిచ్చారు.

**నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు..**

బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఈ నెల 28న సభలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్నారు. అసలు ఈ బడ్జెట్‌ను మార్చి 4వ తేదీన ప్రవేశపెట్టాలని ప్రభుత్వం తొలుత భావించింది కానీ.. అనివార్య కారణాల వల్ల నాలుగు రోజుల ముందుకు జరిపింది.

**శిక్షణా తరగతులు వాయిదా..**

మరోవైపు ఈ నెల 22, 23 తేదీల్లో ఎమ్మెల్యేలకు శిక్షణా తరగతులు నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడితోపాటు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భావించారు. అందుకోసం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతోపాటు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సభలో



సభ్యులు ఎలా మసులుకోవాలనే అంశంపై పార్టీ సీనియర్లతో కొత్తగా ఎన్నికైన జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సోమవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారు. ఆయనతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా సభను తరలి రానున్నారు.

**సభ్యులందరూ సభకు హాజరు కావాలి..**

మరోవైపు 47వ శాసన మండలి, 16వ శాసనసభ మూడవ సమావేశ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లకు సంబంధించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్‌గుప్తాతో సమీక్ష నిర్వహించారు. గవర్నర్ ప్రసంగం జరిగే రోజు ఉదయం 9.30 గంటలకు సభ్యులందరూ సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

**వ్యక్తిగత సహాయకులకు నో ఎంట్రీ..**

బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, అధికారుల వ్యక్తిగత సహాయకులకు పాసులు జారీ చేయడం లేదని స్పష్టం చేశారు. వారికి ఎట్టి పరిస్థితుల్లో ప్రవేశం ఉండదని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రిని కలిసే సందర్శకులు, ప్రతినిధులను శాసనసభ ప్రాంగణంలోకి అనుమతించరని చెప్పారు. అందుకోసం వచ్చేవారు... సీఎంవోలనే భేటీ కావాల్సి ఉంటుందని సూచించారు. శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి..**

సమావేశాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న మీడియా పాయింట్, కొత్తగా నిర్మిస్తున్న క్యాంటీన్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా పరిశీలించి పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనసభ కార్యదర్శి జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఇతర ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# సొరంగంలో ఆశలు గల్లంతు!

**ఈ-కబురు, నాగర్‌కర్నూల్:** శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) తొలి సొరంగం పైకప్పు కుప్పకూలడంతో గల్లంతైన 8 మంది కార్మికుల ఆచూకీ తెలియరాలేదు. కార్మికులను బయటికి తీసుకొచ్చేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ సహాయక బృందాలు ఆదివారం రోజంతా చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రమాదం జరిగి 40 గంటలైనా కార్మికుల జాడగానీ, వారి యోగక్షేమాలుగానీ తెలియకపోవడంతో... వారు సురక్షితంగా బయటపడే అవకాశం తక్కువనే చర్చ జరుగుతోంది. ఆదివారం ఎన్డీఆర్ఎఫ్, ఇతర రెస్క్యూ బృందాలతో కలసి లోకో ట్రైన్ ద్వారా సొరంగం లోపలికి వెళ్లి.. సుమారు 6 గంటల తర్వాత తిరిగి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా.. పరిస్థితి నిరాశాజనకంగా ఉందని పేర్కొన్నారు. సొరంగం లోపలి వరకు వెళ్లి బయటికి వచ్చినవారు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌లెట్ నుంచి 13.93 కిలోమీటర్ల లోపల పైకప్పు కూలిన చోట దాదాపు 200 మీటర్ల మేర మట్టి, బురద నీరు, శిథిలాలతో సొరంగం మూసుకుపోయింది. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 12 కిలోమీటర్ల వద్ద సైతం మోకాలి లోతు నీళ్లు ఉన్నాయి. కూలిన మట్టి, శిథిలాలను తొలగిస్తేగానీ గల్లంతైన కార్మికులను చేరుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటివరకు అలాంటి ప్రయత్నాలేమీ ప్రారంభం కాలేదు.

**ఏదైనా అద్భుతం జరిగితే కానీ..**

సొరంగం లోపల పరిస్థితి భీతావహంగా ఉండటం, మళ్లీ పైకప్పు కూలవచ్చనే ఆందోళనల నేపథ్యంలో రెస్క్యూ కష్టసాధ్యంగా మారింది. దోమలపెంట వద్దనున్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్ నుంచి ప్రమాద స్థలానికి చేరుకునేందుకు ఒక్క లోకో ట్రైన్ మాత్రమే ఆధారం. దాని ద్వారా 12.6 కిలోమీటర్ల దూరం వరకు మాత్రమే ప్రయాణించేందుకు వీలుంది. అక్కడి నుంచి కన్వేయర్ బెల్టు మీద లోపలికి చేరుకోవాల్సి వస్తోంది. సొరంగం కుప్పకూలిన ప్రాంతానికి 100 మీటర్ల సమీపం వరకే సహాయక బృందాలు వెళ్లగలిగాయి. శిథిలాలు కొట్టుకురావడంతో వాటిని తొలగించకుండా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. ఎప్పటికప్పుడు పెరుగుతున్న నీటి ఊటను మోటార్ల సాయంతో తొలగిస్తున్నారు. నిమిషానికి 10 వేల లీటర్ల నీటిని ఎత్తిపోసే మోటార్లను వినియోగిస్తున్నారు. లోపలికి వెళ్లి బయటికి వచ్చిన రెస్క్యూ బృందాలతో మాట్లాడింది. గల్లంతైన కార్మికుల మీద కాంక్రీట్ సెగ్మెంట్లు, మట్టి, శిథిలాలు పడి ఉండవచ్చని వారు పేర్కొన్నారు. లేదా వారు సొరంగం కూలిన ప్రాంతానికి ఆవలివైపు చిక్కుకుని ఉన్నా.. రెండు వైపులా మూతపడి ఉండటంతో ఆక్సిజన్ లభించడం కష్టమేనని భావిస్తున్నట్టు చెప్పారు. ఏదైనా అద్భుతం జరిగితేనే వారు ప్రాణాలతో ఉంటారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సొరంగం కూలిన ప్రాంతానికి 100 మీటర్ల సమీపం దాకా వెళ్లిన రెస్క్యూ సిబ్బంది.. కార్మికులను ఉద్దేశించి గట్టిగా అరుస్తూ పిలిచినా ఎలాంటి స్పందన రాలేదని అంటున్నారు.

**తీవ్ర ఉత్కంఠ మధ్య..**

ఎస్ఎల్‌బీసీ సొరంగం%-%1 ఇన్‌లెట్ నుంచి 13.93 కిలోమీటర్ల లోపల శనివారం ఉదయం 8.30 గంటలకు పైకప్పు కూలిపడింది. ఆదివారం అర్ధరాత్రి సమయానికి 40 గంటల కీలక సమయం గడిచిపోయింది. దీనితో కార్మికుల క్షేమంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. తీవ్ర ఉత్కంఠ మధ్య ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, అగ్నిమాపక శాఖ, ఆర్మీకి చెందిన రెస్క్యూ సిబ్బంది మూడు వేర్వేరు బృందాలుగా ఏర్పడి సొరంగం లోపలికి లోకో ట్రైన్ ద్వారా వెళ్లారు. వారు తిరిగి వచ్చి గల్లంతైన కార్మికుల యోగక్షేమాల గురించి చెబుతారేమోనని.. సొరంగం బయట అధికారులు, నేతలు, మీడియా ప్రతినిధులు ఉత్కంఠగా ఎదురు చూశారు. కానీ మంత్రితోపాటు రెస్క్యూ సిబ్బంది నిరాశ వ్యక్తం చేశారు.

**సహాయక చర్యల్లో ఆర్మీ**

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యల కోసం సైన్యం కూడా రంగంలోకి దిగింది. సికింద్రాబాద్ నుంచి ఆర్మీ బైసన్ డివిజన్‌కు చెందిన ఇంజనీర్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నట్టు అధికారులు తెలిపారు. ఆర్మీ వైద్య బృందాలను సైతం టన్నెల్ వద్ద అందుబాటులో ఉంచారు. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా ఆర్మీ అధికారులు రెస్క్యూ ఆపరేషన్లను సమన్వయం చేస్తున్నారు.

**శిథిలాలు, బురద తొలగించేదెలా?**

సొరంగం కూలిపడి పేరుకుపోయిన మట్టిని, శిథిలాలను తొలగించనిదే కార్మికుల వద్దకు రెస్క్యూ బృందాలు చేరుకోలేని పరిస్థితి. కానీ నీటి ఊటల కారణంగా.. మట్టిని తొలగించిన కొద్దీ పైకప్పు మళ్లీ కూలే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సొరంగం భూఉపరితలం నుంచి సుమారు 400 మీటర్ల దిగువన ఉందని, కూలిన చోట మట్టిని తీసినకొద్దీ.. పైన వదులుగా ఉన్న మట్టి మళ్లీ సొరంగంలోకి పడిపోతుందని రెస్క్యూ సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే సొరంగంపైన భూమి ఉపరితలం నుంచి డ్రిల్లింగ్ చేసి కార్మికులను బయటికి తీసుకువచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపినా.. 400 మీటర్ల లోతున రంధ్రం చేయడానికి చాలా రోజుల సమయం పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సొరంగంలో పేరుకున్న మట్టి, నీళ్లు, ఇతర శిథిలాలను తొలగించేందుకూ కొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

**పైకప్పు కూలిన చోట.. కాంక్రీట్ సెగ్మెంట్ లేదు!**

సొరంగంలో ప్రమాదం జరిగిన చోట పైకప్పుకు రక్షణగా కాంక్రీట్ సెగ్మెంట్లు లేవని తెలిసింది. టన్నెల్ చివరన పనులు జరిగిన చోట సుమారు 100 మీటర్ల మేర కాంక్రీట్ సెగ్మెంట్లను ఏర్పాటు చేయలేదని సమాచారం. అంతేగాకుండా సొరంగంలో నాలుగేళ్లుగా నీటి ఊటలు (సీపేజీ) కొనసాగుతుండటంతో మట్టి వదులుగా మారడం, తవ్వకం పనుల్లో రక్షణ గోడ నిర్మించకపోవడం, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడంతో పైకప్పు కుప్పకూలిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏదైనా వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంటేనే..**

సొరంగం లోపల చిక్కుకున్న కార్మికులను బయటికి తెచ్చేందుకు ఏదైనా వ్యూహాన్ని సిద్ధం చేసుకుని ఆచరణలో పెడితేనే ఫలితమిచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రత్యేక వ్యూహం లేకుండా రెస్క్యూ బృందాలు లోపలి వరకు వెళ్లి వచ్చినట్టు తెలిసింది. సొరంగంలో పేరుకున్న మట్టిని తొలగించి కన్వేయర్ బెల్టుల ద్వారా, లేదా లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపితే గానీ చిక్కుకున్న కార్మికుల జాడ కనుక్కోలేని పరిస్థితి నెలకొంది. అడ్డంకులన్నీ అధిగమించి కార్మికులను చేరుకునేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

**టీబీఎం మెషీన్ దగ్గరికి చేరుకోవడమే కష్టంగా ఉంది**

సొరంగంలో పైకప్పు కూలిన చోట ఉన్న టీబీఎం మెషీన్ వద్దకు చేరుకోవడమే కష్టంగా ఉంది. ఇప్పటివరకు రెండు సార్లు లోపలికి వెళ్లి వచ్చాం. మెషీన్ వద్ద 200 మీటర్ల దాకా భారీగా బురద పేరుకుని ఉంది. దాన్ని దాటడం వీలుపడటం లేదు. టన్నెల్ పైకప్పు మళ్లీ కుంగకుండా సేఫ్టీ కోసం రాక్ బోల్టింగ్ చేస్తున్నాం. నీటి తొలగింపు కొనసాగుతోంది.

**వారి జాడ కనిపించలేదు..**

టన్నెల్‌లో భారీగా మట్టి, శిథిలాలు పేరుకుపోవడంతో మెషీన్ దగ్గరికి వెళ్లేందుకు కుదరడం లేదు. చిక్కుకున్న వారి జాడ ఏదీ కనిపించలేదు. ఎలాంటి అరుపులు సైతం వినిపించలేదు.

**రాళ్లు, నీరు, బురదతో నిండిపోయింది**

టన్నెల్ రాళ్లు, నీరు, బురదతో నిండిపోయింది. 200 నుంచి 500 మీటర్ల మధ్య టన్నెల్ బోరింగ్ మెషీన్ బురదలో కూరుకుపోయింది. 35 మందిమి సహాయక చర్యలకు అవసరమైన సామగ్రి తీసుకొని వెళ్లాం. రాత్రంతా కష్టపడి దగ్గరకు చేరుకోగలిగాం. పెద్ద శబ్దంతో నీళ్లు వచ్చాయి.. మేం పనుల కోసం టన్నెల్ చివరికి చేరుకుంటున్న సమయంలోనే ఒక్కసారిగా పెద్ద శబ్దంతో నీళ్లు వచ్చాయి. సిమెంట్ దిమ్మెలు కూలి, పెద్ద ఎత్తున మట్టి కుంగింది. మేమంతా భయంతో వెనక్కి పరుగెత్తుకు వచ్చాం. చేతులు, కాళ్లు, ముఖానికి చిన్న గాయాలయ్యాయి. ఏం జరుగుతోందో అర్థం కాలేదు శనివారం ఉదయం టన్నెల్‌లో ఒక్కసారిగా శబ్దం వచ్చింది. ఏం జరుగుతోందో అర్థం కాలేదు. మా వాళ్లు కొందరు మెషీన్ వైపు ఉన్నా, ఏమీ చేయలేక భయంతో వెనక్కి వచ్చాం. వాళ్లు మట్టి, బురదలో మునిగారు. ప్రాణాలతో బయటికి వస్తారో, లేదో తెలియదు. మా వాళ్ల పరిస్థితి ఏంటో తెలియదు.. టీబీఎం ముందు భాగంలో 8 మంది ఉన్నారు. మేం వెనక భాగంలో ఉన్నాం.

# అక్రమ నిర్మాణాల్లో అయ్యప్ప సొసైటీదే అగ్రభాగం

## అధికారుల అండతో చెలరేగిపోతున్న అక్రమ నిర్మాణదారులు

## హైడ్రా కమిషనర్ ‘ అన్నీ అక్రమాలేనని” తేల్చినా ఆగని నిర్మాణాలు

## అయ్యప్ప సొసైటీ కారణంగా అత్యంత అవినీతిమయ సర్కిల్ గా చందానగర్



అయ్యప్ప సొసైటీలో అనుమతులు లేకుండా చేపడుతున్న భారీ భవనాలు



ఏ సందు చూసినా ఇటువంటి అనుమతి లేని అక్రమ నిర్మాణాలే

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అత్యంత ఖరీదైన మాదాపూర్ లో అక్రమ నిర్మాణదారులు చెలరేగిపోతున్నారు. వివాదాస్పద మాదాపూర్ గురుకుల్ ట్రస్ట్ భూముల్లో గత ప్రభుత్వాలు నిర్మాణాలు చేపట్టకుండా కఠినంగా వ్యవహరించగా, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతోనే స్వేచ్ఛ లభించిన నిర్మాణదారులు ఖాళీ స్థలాలను కనిపించకుండా మాయం చేస్తున్నారు. గోడ కట్టేందుకు సైతం అనుమతి లేని అయ్యప్ప సొసైటీ గురుకుల్ ట్రస్ట్ భూముల్లో ఏ సందు చూసినా ఆకాశమెత్తు అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవలసిన చందానగర్ టౌన్ ప్లానింగ్ విభాగం అక్రమ నిర్మాణదారులు ఎర వేస్తున్న అవినీతి సొమ్ములో మునిగి తేలుతుండడంతో అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది. గురుకుల్ ట్రస్ట్ అయ్యప్ప సొసైటీ కారణంగా గ్రేటర్ హైదరాబాద్ లోనే అత్యంత అవినీతిమయ సర్కిల్ గా చందానగర్ సర్కిల్ నేడు వెలుగొందుతుంది. గ్రేటర్ ఆదాయానికి గండికొడుతూ ఎటువంటి నిర్మాణ అనుమతి లేకుండా జీరో పర్మిషన్ తో 6, 7 అంతస్తుల భారీ భవనాలను నిర్మిస్తున్నారు. ఒక్క అయ్యప్ప సొసైటీలోనే దాదాపు 100 పైచిలుకు నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే అధికారుల అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**అధికారులు మారినా ఆగని అక్రమాలు..**

గ్రేటర్ హైదరాబాద్ లోనే అత్యంత కీలకమైన శేరిలింగంపల్లికి జోనల్ కమిషనర్ గా ఉపేందర్ రెడ్డి రావడంతోనే జోన్ పరిధిలోని సర్కిళ్లు, టౌన్ ప్లానింగ్ విభాగం ప్రక్షాళన చేపట్టారు. చందానగర్ డిప్యూటీ కమిషనర్ నుంచి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, టీపీఎస్, చైన్ మెన్ల వరకు అందరినీ బదిలీ చేశారు. కొత్తగా భాధ్యతలు చేపట్టిన అధికారులు అక్రమ నిర్మాణాల మీద ఉక్కుపాదం మోపడం ఖాయమని అంతా భావించారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. జోనల్ స్థాయిలో, సర్కిల్ పరిధిలో కొత్త అధికారులు భాధ్యతలు స్వీకరించడం అక్రమార్కులకు వరంగా మారింది. కాలనీల్లో పర్యటించని అధికారులను ఇంటికి పంపిస్తామని ఓవైపు ముఖ్యమంత్రి హెచ్చరిస్తుండగా, మరోవైపు వెస్ట్ జోన్, చందానగర్ సర్కిల్ అధికారులు కార్యాలయ గడప దాటకపోవడం కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి వరంగా మారుతుంది. అక్రమ నిర్మాణదారులు ముట్టజెప్పే అవినీతి సొమ్మును అలవాటు పడి అయ్యప్ప సొసైటీ భూముల్లో అవినీతి పంట పండిస్తున్న సిబ్బంది తమ జేబులు నింపుకుంటున్నారు.

**అక్రమాలేనని హైడ్రా కమిషనర్ తేల్చినా...**

స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైతం అయ్యప్ప సొసైటీలో నిర్మిస్తున్న నిర్మాణాలన్నీ అక్రమాలేనని తేల్చినా ఇక్కడి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడం లేదు. గత కొన్ని రోజుల క్రితం ఓ అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేసిన హైడ్రా కమిషనర్ అయ్యప్ప సొసైటీలో కొనసాగుతున్న నిర్మాణాలన్నీ అక్రమ నిర్మాణాలేని తేల్చి చెప్పారు. ఓవైపు జిహెచ్ఎంసి అనుమతులతో చేపట్టిన నిర్మాణాలను సైతం కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు అయ్యప్ప సొసైటీలో ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న భారీ బహుళ అంతస్తులపై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కించడం విస్తుగొలుపుతుంది. రాష్ట్రంలోని అత్యున్నత అధికార కార్యాలయం నుంచి వస్తున్న ఒత్తిళ్ల కారణంగానే అయ్యప్ప సొసైటీ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి స్వయంగా హైడ్రా కమిషనర్ అక్రమాలేనని తేల్చిన నిర్మాణాలపై సైతం చర్యలు తీసుకోకపోవడం అటు హైడ్రా, ఇటు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విశ్వసనీయతను ప్రశ్నించే విధంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టీసీలో తొలిసారి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు డ్రైవర్లు!



**ఈ-కబురు,** హైదరాబాద్: బస్సులు నడిపేందుకు ఆర్టీసీ తొలిసారి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో డ్రైవర్లను సమకూర్చుకోనుంది. గతంలో పలు సందర్భాల్లో డిపోల్లో బస్సులను పార్క్ చేయటం, అటూ ఇటూ మార్చటం కోసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొంతమందిని నియమించుకున్నారు. కానీ రూట్లలో నడిపేందుకు మాత్రం తీసుకోలేదు. ప్రస్తుతం డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉండటం, శాశ్వత నియామక ప్రక్రియ ఇప్పట్లో జరిగే పరిస్థితి లేకపోవటంతో ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన వారిని నియమించుకోవాలని నిర్ణయించింది. 1,500 మంది డ్రైవర్లను వెంటనే నియమించుకుని, రెండు వారాల శిక్షణ ఇచ్చి బస్సులు అప్పగించనుంది. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది.

**పెరుగుతూ వచ్చిన కొరత**

భవిష్యత్తులో సొంతంగా బస్సులు అంతగా కొనాల్సిన అవసరం లేకుండా అద్దె ప్రాతిపదికన పెద్ద సంఖ్యలో బస్సులు (ఎలక్ట్రిక్ సహా) సమకూర్చుకుంటున్న ఆర్టీసీ, సిబ్బంది విషయంలోనూ భారం లేకుండా చూసుకుంటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆర్టీసీలో సగటున నెలకు 50 మంది చొప్పున డ్రైవర్లు రిటైర్ అవుతున్నారు. మరోవైపు చాలాకాలంగా నియామకాలు లేకపోవటంతో క్రమంగా డ్రైవర్లకు కొరత పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 1,500 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు లెక్క తేలింది. ప్రత్యేక సందర్భాల్లో అదనపు బస్సులు తిప్పేందుకు డ్రైవర్లు లేని పరిస్థితి ఎదురవుతోంది. వేసవి సెలవుల్లో రద్దీ భారీగా ఉంటుంది. వీలైనన్ని ఎక్కువ బస్సులు తిప్పాల్సి ఉంటుంది. 1,500 మంది డ్రైవర్ల కొరతతో ఇది సాధ్యం కాదు. ఇప్పటికే చాలామంది డ్రైవర్లకు అవసరాన్ని బట్టి డబుల్ డ్యూటీలు వేయాల్సి వస్తోంది.

**నియామక ప్రక్రియ జాప్యంతో..**

దాదాపు ఏడాది క్రితమే 3 వేల డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించగా, 2 వేల పోస్టుల భర్తీకి అనుమతి వచ్చి%శీ%ది. అయితే ఆర్టీసీ కాకుండా పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి సంబంధించి టీఎస్‌పీఎస్సీ, మెడికల్ సిబ్బందికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియామక ప్రక్రియలు చేపడతాయని పేర్కొంది. కానీ ఆ మూడు సంస్థలు ఇప్పటివరకు జాబ్ కేలండర్‌ను ప్రకటించలేదు. ఆర్టీసీ సిబ్బంది కోసం ఎదురు చూస్తూనే ఉంది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో నియామక ప్రక్రియల్లో మరింత జాప్యం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఔట్‌సోర్సింగ్ పద్ధతి తెరపైకి వచ్చింది.

**4 నెలల కాలానికే..**

భవిష్యత్తులో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు, సాధారణ అద్దె ప్రాతిపదికన డీజిల్ బస్సులు తీసుకోనున్నందున, ఆర్టీసీకి సొంత డ్రైవర్ల అవసరం తగ్గుతుంది. బస్సులను అద్దెకు ఇచ్చే సంస్థలే డ్రైవర్లను ఏర్పాటు చేసుకోనుండటం దీనికి కారణం. ఈ నేపథ్యంలోనే డ్రైవర్లను నియమించుకోవటం కంటే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవటం మంచిదనే అభిప్రాయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. దీనివల్ల ఆర్టీసీపై జీతాల భారం తగ్గుతుంది. ఇప్పుడు తీసుకోబోతున్న 1,500 మంది డ్రైవర్ల ఉద్యోగ కాలం మార్చి నుంచి జూన్ వరకు అని ఆర్టీసీ సర్క్యులర్‌లో పేర్కొంది. తదుపరి అవసరాలను బట్టి వీరి కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. అయితే వీరిని భవిష్యత్తులో కూడా కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

## నేటి గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా

### ఏపి ప్రభుత్వం కీలక నిర్ణయం

**ఈ-కబురు, అమరావతి:** నేటి గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు గ్రూప్స్ 2 మెయిన్ పరీక్షలపై ఏపీపీఎస్సీ కీలక ప్రకటన చేసింది. ఆదివారంనిర్వహించాల్సిన పరీక్షను కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీపీఎస్సీ సెక్రటరీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. రోస్టర్ తప్పులను సరిచేయకుండా పరీక్ష నిర్వహణపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోస్టర్ అంశంపై ఏపీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. వచ్చే నెల 11వ తేదీన మరోమారు ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టనుంది. హై కోర్టులో ఉన్న ఈ అంశంపై అఫిడవిట్ వేసేందుకు ఇంకా సమయం ఉందని అప్పటి వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాగా, గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని, రోస్టర్ విధానంలో మార్పులు చేయాలంటూ అభ్యర్థులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయంపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా.. పరీక్షలను నిలిపి వేయడాన్ని నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రూప్-2 అభ్యర్థులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. విశాఖపట్నం, హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. 2023 డిసెంబరు 7వ తేదీన ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ సుప్రీంకోర్టు తీర్పు, ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 77కి విరుద్ధంగా ఉందని, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి విస్మరించారని తెలిపారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించి, 23న జరగనున్న గ్రూపు-2 మెయిన్స్ పరీక్షను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. అయితే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష అనంతరం అభ్యర్థుల నుంచి మరోసారి పోస్టుల ప్రాధాన్యతలు తీసుకుంటారని ఏపీపీఎస్సీ తెలిపింది. ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా రూపొందించే ముందు దీనికి సంబంధించిన ప్రక్రియ చేపడతామని తెలిపింది. పోస్టులు, జోన్‌లపై అభ్యర్థులు ప్రాధాన్యతలు ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించింది. అలాగే న్యాయం చేస్తానని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

## కుప్పకూలిన సొరంగం

**ఈ-కబురు:** శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం సొరంగం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలడంలో 8 మంది లోపలే చిక్కుకుపోయారు. అందులో ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారు. వారిని కాపాడేందుకు అధికారులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. కానీ బాధితులు సొరంగంలో 14 కిలోమీటర్ల లోపల శిథిలాలు, బురదలో చిక్కుకుపోవడంతో బయటికి తీసుకురావడం కష్టంగా మారింది. ఘటన విషయం తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు టన్నెల్ వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మరోవైపు సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపుతామని, పూర్తి సహకారం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు.

**ఇటీవలే పనులు పునః ప్రారంభమై...**

శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలను తరలించే 'ఎస్-ఎల్‌బీసీ' ప్రాజెక్టులో భాగంగా భారీ సొరంగం నిర్మిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వైపు (టన్నెల్ ఇన్‌లెట్) నుంచి టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)తో ఈ తవ్వకం కొనసాగుతోంది. కొంతకాలం కింద టీబీఎం బేరింగ్ చెడిపోగా పనులు నిలిచిపోయాయి. ఇటీవలే అమెరికా నుంచి పరికరాలు తెప్పించి మరమ్మతు చేశారు. నాలుగైదు రోజుల కిందే పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుతం సొరంగం లోపల 14వ కిలోమీటర్ వద్ద పనులు జరుగుతున్నాయి. శనివారం ఉదయం టన్నెల్ ఇన్‌లెట్ నుంచి 14 కిలోమీటర్ పాయింట్ వద్దకు ప్రాజెక్టు ఇంజనీర్లు, మెషీన్ ఆపరేటర్లు, కార్మికులు చేరుకున్నారు.

**నీటి ఊట పెరిగి.. కాంక్రీట్ సెగ్మెంట్ ఊడిపోయి..**

ఉదయం 8.30 గంటల సమయంలో టన్నెల్‌లో నీటి ఊట పెరిగింది. దీనితో మట్టి వదులుగా మారి.. సొరంగం గోడలకు రక్షణగా లేర్పాటు చేసిన రాక్‌బోల్ట్, కాంక్రీట్ సెగ్మెంట్లు ఊడిపోయాయి. పైకప్పు నుంచి మట్టి, రాళ్లు కుప్పకూలాయి. ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించడంతో.. టీబీఎం మెషీన్‌కు ఇవతలి వైపున్న 50 మంది వరకు కార్మికులు సొరంగం నుంచి బయటికి పరుగులు తీశారు. మెషీన్‌కు అవతలి వైపున్న 8 మంది మాత్రం మట్టి, రాళ్లు, శిథిలాల వెనుక చిక్కుకుపోయారు. టన్నెల్‌లో సుమారు 200 మీటర్ల వరకు పైకప్పు శిథిలాలు కూలినట్టు సమాచారం. వేగంగా సహాయక చర్యలు చేపట్టినా...: సొరంగం పైకప్పు కూలిన విషయం తెలిసిన వెంటనే.. లోపల చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పైకప్పు కూలిపడటంతో జనరేటర్ వైర్లు తెగిపోవడంతో సొరంగం మొత్తం అంధకారం ఆవహించింది. పైగా 14 కిలోమీటర్ల లోపల ఘటన జరగడం, నీటి ఊట ఉధృతి పెరగడం, శిథిలాలు, బురదతో నిండిపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందిగా మారింది. ఈ సొరంగానికి ఇన్‌లెట్ తప్ప ఎక్కడా ఆడిట్ టన్నెళ్లు, ఎస్కేప్ టన్నెళ్లు లేవు. దీనితో ఒక్క మార్గం నుంచే లోపలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం సాయంత్రానికి సుమారు 150 మంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఆదివారం ఉదయానికి ఆర్మీ బృందాలు సైతం చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొననున్నాయి.

## మహాశివరాత్రికి 3,000 ప్రత్యేక బస్సులు

**ఈ-కబురు, హైదరాబాద్:** మహా శివరాత్రి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ప్ర ముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు లు నడపనుంది. 43 శైవ క్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. 24వ తేదీ నుంచి 28 వరకు ఈ ప్రత్యే క బస్సులు అందుబాటులో ఉంటా యి. ప్రధానంగా శ్రీశైల క్షేత్రానికి 800, వేములవాడకు 714, ఏడుపా యల జాతరకు 444, కీసరగుట్టకు 270, వేలాలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సుల చొప్పున నడుపనున్నారు.

# ఆత్మావలోకనం అవసరం

విశ్వసనీయతను కాపాడుకునే విషయంలో, విలువలు పాటించే అంశంలో పట్టింపు ఉన్నట్టు కనబడకపోతే వ్యక్తులైనా, వ్యవస్థలైనా విమర్శలపాలు కాకతప్పదు. తన రిటైర్మెంట్‌కు ఒక రోజు ముందు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల సంఘం(ఈసీ) చీఫ్ రాజీవ్ కుమార్ తమపై వస్తున్న విమర్శలకూ, ఆరోపణలకూ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓడిన వారు ఫలితాలను జీర్ణించుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నది ఆయన అభిప్రాయం. దీనికి మూలం ఎక్కడుందో, తామెంత వరకూ బాధ్యులో ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకునివుంటే సమస్య మొత్తం ఆయనకే అర్థమయ్యేది. ఈసీకి ఇప్పటికీ ఏదోమేర విశ్వసనీయత ఉందంటే అది మాజీ సీఈసీ టీఎన్ శేషన్ పెట్టిన భిక్ష. అంతకుముందు ఈసీ ఉనికి పెద్దగా తెలిసేది కాదు. అది రాజ్యాంగ సంస్థ అనీ, దానికి విస్తృతాధికారాలు ఉంటాయనీ ఎవరూ అనుకోలేదు. శేషన్ తీరు నియంతను పోలివుంటుందని, తానే సర్వంసహాధికారినన్నట్టు ప్రవర్తిస్తారని ఆరోపణలొచ్చిన మాట వాస్తవమే అయినా ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించటంలో, అవసరమైతే ఎన్నికలను రద్దు చేయటం వంటి కఠిన చర్యలకు వెనకాడకపోవటంలో ఆయనకెవరూ సాటిరారు. అనంతరం వచ్చిన సీఈసీల్లో అతి కొద్దిమంది మాత్రమే శేషన్ దరిదాపుల్లోకొచ్చే ప్రయత్నం చేశారు. గత కొన్నేళ్లుగా అసలు ఆ ఊసే లేకుండా కాలక్షేపం చేసినవారే అధికం. శేషన్ నెలకొల్పిన ప్రమాణాలను అందుకోకపోతే పోయారు... కనీసం ఆ సంస్థ ఔన్నత్యాన్ని దిగజార్చకపోతే బాగుండునని కోరు కోవటం కూడా అత్యాశేనన్న చందంగా పరిస్థితి మారింది. దాని స్వతంత్రత, తటస్థత, విశ్వస నీయత ప్రశ్నార్థకమయ్యే రోజులొచ్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించటానికి రాజ్యాంగం సృష్టించిన సంస్థ ఈసీ. అది తనకు ఎదురయ్యే అనుభవాలతో తన అధికారాలను పునర్నిర్వచించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తే, దానిద్వారా రాజ్యాంగం ఆశించిన ఉద్దేశాలు నెరవేరేవి. ఈసీ ఏక సభ్య సంఘంగా మొదలై త్రిసభ్య సంఘమైంది. కానీ ఉన్న అధికారాలనే సక్రమంగా వినియోగించుకోలేని అశక్తతకు లోబడుతుండటం చేదు వాస్తవం. రాజ్యాంగం ఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి ఇచ్చినా దాన్ని వినియోగించుకోవటంలో ఆసక్తి కనబరుస్తున్న దాఖలా లేదు. పార్టీలను నమోదు చేసుకునే అధికారం 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ఈసీకి ఇస్తోంది. ఆ నమోదును రద్దు చేసే లేదా ఆ పార్టీనే రద్దుచేసే అధికారం మాత్రం లేదు. మరింత స్వతంత్రంగా, మరింత దృఢ సంకల్పంతో వ్యవహరించమని వేర్వేరు తీర్పుల్లో సుప్రీంకోర్టు చేసిన సూచనలకు అనుగుణంగా ఈసీ వ్యవహరించివుంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో! గెలిచిన పార్టీలకు ఆరోపణలు చేసే అవసరం తలెత్తదు. అంతటి త్యాగధనులు కూడా ఎవరూ లేరు. కానీ మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ చేసిన ఆరోపణల మాటేమిటి వాటినీ కొట్టిపారేస్తారా కనీసం ఆయన వ్యాఖ్యలపైన స్పందించలేని అచేతన స్థితికి ఈసీ చేరుకోవటాన్ని రాజీవ్ ఏరకంగా సమర్థించుకోగలరు రోజులు గడిస్తే తప్పులు సమసిపోతాయా ఇంత అమాయకత్వాన్ని నటిస్తున్న రాజీవ్ నిరుడు మేలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల తంతుపై వచ్చిన విమర్శలకు ఈ ఎనిమిది నెలల్లో ఒక్కసారైనా జవాబిచ్చారా పోలింగ్ జరిగినరోజు రాత్రి 8 గంటలకు వోటింగ్ శాతాన్ని 68.12 అని ప్రకటించి, మరో మూడు గంటలు గడిచాక దాన్ని ఏకంగా 76.50 శాతమని చెప్పటం, మరో నాలుగు రోజులకు మళ్లీ గొంతు సవరించుకుని 80.66గా మార్చటంలోని మర్మమేమిటి ఈ పెంపు ఏకంగా 12.5 శాతం. దాన్ని అంకెల్లోకి మారిస్తే 49 లక్షలు! ఈ మాయా జాలం ఏమిటో, కొత్తగా పుట్టుకొచ్చిన ఈ 49 లక్షలమంది కథాకమామీషు ఏమిటో చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉండనవసరం లేదా తమకై తాము ప్రజలను అయోమయంలోకి నెట్టి, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసి రాజకీయపక్షాలపై బండరాళ్లు వేయటం ఏ రకమైన నీతి మహారాష్ట్ర ఎన్నికలు సైతం ఈ బాణీలోనే సాగాయి. పోలింగ్ ముగిసిన సాయంత్రం 58.2 శాతం (6,30,85,732) మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పిన ఎన్నికల సంఘమే రాత్రికల్లా 65.02 శాతమని మార్చింది. కౌంటింగ్‌కు ముందు అది కాస్తా 66.05 శాతానికి పెరిగింది. అంటే వోటింగ్‌లో 7.83 శాతం పెరుగుదల. అంకెల్లో చూస్తే స్థూలంగా 76 లక్షలు. ఇలాంటి దుఃస్థితి అఘోరించినప్పుడు సందేహాలు రావా ఆరోపణలు వెల్లువెత్తవారాజీవ్ మీడియా సమావేశం రోజునే ప్రధాని మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడిన కమిటీ కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఇది సరికాదంటూ విపక్ష నేత రాహుల్‌గాంధీ అసమ్మతి నోట్ అందజేశారు. ఇలా వివాదాస్పద ఎంపికలోనే సమస్యకు బీజం ఉంటుందని, అటుపై ఈసీ నడతను నిశితంగా పరిశీలించటం మొదలవుతుందని రాజీవ్ గుర్తిస్తే మంచిది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈసీ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నదని ఖురేషీ విమర్శిస్తే ఇదే రాజీవ్ నొచ్చుకుని 'ఎంతమంది సీఈసీలు ప్రవర్తనా నియమావళికి సంబంధించిన ఫిర్యాదులు అందుకున్నారో, వాటి ఆధారంగా ఎందరిపై చర్య తీసుకున్నారో మేం ఆరా తీశాం' అని గంభీరంగా ప్రకటించారు. అదేమిటో బయటపెట్టాలని ఖురేషీ సవాలు చేస్తే ఈ ఆరేళ్లుగా మౌనమే సమాధానమైంది. ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించటం లేదని చెప్పటానికి ఇది చాలదా

# రైతులకు అందుబాటులో ఎరువులు

### యూరియా సరఫరాకు కేంద్రానికి తుమ్మల లేఖ

### అధికారులతో పరిస్థితులపై సమీక్ష

**ఈ-కబురు, హైదరాబాద్:** రైతులకు ఎరువుల కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏయే ఎరువుల ఎంతెత అవసరమో స్టాక్ పెట్టుకోవాలన్నారు. అరాష్ట్రంలో ఎరువుల సరఫరా లభ్యతపై రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ సంచాలకులు మాట్లాడుతు, గత 5 సంవత్సరాల్లో అత్యధికంగా 2022-23 యాసంగిలో 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వాడకం ఉన్నదని, దానిని ప్రామాణికంగా తీసుకొని, అంతకంటే ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంచేటట్టు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 1 నుండి ఇప్పటిదాకా కేంద్రం నుండి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా ప్రణాళికలు ఇవ్వగా, కేవలము 6.73 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కాబడినదని, ఇదే విషయాన్ని సీజన్ ఆరంభములో కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లగా, మన రాష్ట్ర అవసరాలను పరిగణలోకి తీసుకొని ఎప్పటికప్పుడు సరఫరా చేసే బాధ్యత తమదని కేంద్రం నుండి భరోసా వచ్చినప్పటికి కేవలం ఫిబ్రవరి మాసములోనే 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా రావడం జరిగిందని తెలిపారు. అయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్1 న ప్రారంభనిల్వలు 3.08 లక్షల మెట్రిక్ టన్నులను జాగ్రత్తగా సరఫరా చేస్తు, రాష్ట్రం మొత్తం మీద రైతుల అవసరాలకు తగ్గట్టు ఇప్పటిదాకా సరఫరా చేయడం జరిగిందని, ఇకముందు కూడా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1.30 లక్షల మెట్రిక్ టన్నులను అవసరాల మేరకు ఆయా జిల్లాలకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో మన రాష్ట్రానికి ఈ నెలలో రావాల్సిన యూరియాను వెంటనే ఇతర కంపెనీల ద్వారా సరఫరా చేయుటకు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రిని లేఖ ద్వారా తిరిగి కోరడం జరిగింది. మన రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను సరఫరా చేయుటకు కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి అవసరం మేరకే కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి రైతులను కోరడం జరిగింది. సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు శ్రీ గోపి , కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

# జగన్ రాకతోనే మిర్చి రైతుల సమస్యలు తెలిసాయి

### ఇన్నాళ్లూ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదో చెప్పాలి

### వైఎస్ షర్మిల వ్యక్తిగత ఎజెండాతో మాట్లాడుతున్నారు

### వైకాపా నేత, మాజీమంత్రి బొత్స విమర్శలు

**ఈ-కబురు, విశాఖపట్నం:** ఏపీలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, వైసీపీనేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. జగన్ నేరుగా వెళ్లి మిర్చి రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుస కున్నారని తెలిపారు. ఆ పర్యటన తర్వాతే మిర్చి రైతులు సమస్య ప్రభుత్వానికి తెలిసి ందని అన్నారు. ఢిల్లీలో సంబంధిత మంత్రి లేకపోయినా మిర్చి రైతుల సమస్యలు కోసం మాట్లాడటానికి వెళ్తున్నామని సీఎం చంద్ర బాబు ఎలా చెబుతారని ప్రశ్నించారు. జగన్ వెళ్తే కానీ మిర్చి రైతులు ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియలేదా అని నిలదీశారు. ఈ ప్రభుత్వానికి రైతులు, వ్యవసాయం పట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. మిర్చి రైతుల సమస్యలు తెలుసుకోవడానికి జగన్ వెళ్తే ఈల్లీగల్ యాక్టివిటీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తమరి మ్యూజికల్ నైట్‌కు వెళ్లడం ఏ ఆక్టివిటీ అవుతుందని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ప్రాధాన్యం లేదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. భూ కుంభ కోణాలపై వేసిన సిటీ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆది ఏ ప్రభుత్వ హయాంలో జరిగిన నివేదిక బయటపెట్టాలన్నారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యక్తిగత అజెండాతో మాట్లాడుతున్నారని విమర్శి ంచారు. వ్యక్తిగత ఎజెండాలకు రాజకీయాల్లో తావులేదని చెప్పారు. జగన్మోహన్ రెడ్డికి మిర్చి యార్డ్‌కు వెళ్లవద్దని ఎన్నికల కమిషన్ ఏం చెప్పలేదని అన్నారు. కోడి కత్తి కేసులో జగన్మోహన్ రెడ్డి హాజరకాకపోతే కోర్టు నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. గ్రూప్ 2లో రోస్టర్ విధానంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. అభ్యర్థులకు ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమా ండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా అమలు చేయడంలో సీఎం చంద్ర బాబు విఫలమయ్యారని మండి పడ్డారు.

# పాక్ జైలు నుంచి 22మంది మత్స్యకారుల విడుదల

**ఈ-కబురు,** లాహోర్: పాకిస్థాన్ జైలు నుంచి 22 మంది మత్స్యకారులు విడుదలయ్యారు. గతకొంతకాలంగా వీరు కరాచీ కారాగారంలో మగ్గుతున్నారు. వీరంతా అంతర్జాతీయ జలసంధిని దాటినందుకు అరెస్ట్ అయ్యారు. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి శుక్రవారం బయటకువచ్చారు. ఆ మత్స్యకారుల్ని భారత్‌కు అప్పగించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలో భారత జాలర్లకు ఈధి ఫౌండేషన్ సహాయసహకారాలు అందించింది. వారు కరాచీ నుంచి లాహోర్‌కు వెళ్లడానికి కావాల్సిన రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేసింది. అక్కడి నుంచి వారు భారత్‌కు రానున్నారు. ఆ సంస్థ మత్స్యకారులకు ప్రయాణఖర్చులు, కొన్ని బహుమతులు, నగదు అందించింది. ఈ సందర్భంగా భారత్-పాక్ ప్రభుత్వాలకు ఈధి ఫౌండేషన్ ఛైర్మన్ ÷జైల్ ఈధి ఒక అభ్యర్థన చేశారు. ఎలాంటి దురుద్దేశం లేకుండా పొరపాటున అంతర్జాతీయ జలాల సరిహద్దులు దాటుతున్న వారిపై దయతో వ్యవహరించాలని అభ్యర్థించారు.

## ఇప్పటికే వాటాకు మించి నీటిని వినియోగించిన ఏపి

**ఈ-కబురు,** హైదరాబాద్:ఇప్పటికే వాటాకు మించి నీటిని ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీరు తీసుకోకుండా నిలువరించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం మరోమారు కోరింది. శుక్రవారం తలపెట్టిన బోర్డు ప్రత్యేక సమావేశం వాయిదా పడిన తరుణంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్.. జలసౌధలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ బొజ్జా.. బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించారు. ఏపీ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకొందన్న తెలంగాణ అధికారులు.. ఇక నుంచి ఉమ్మడి జలాశయాల నుంచి ఏపీ నీటిని తీసుకోరాదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. మే నెల వరకు తెలంగాణకు 107 టీఎంసీల నీరు ఇవ్వాలని బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. ఇవాళ జరగాల్సిన ప్రత్యేక సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఆంధప్రదేశ్ కోరినందున, ఆ రోజు సమావేశంలో చర్చించే వరకు శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా చూడాలని తెలంగాణ అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ బోర్డు తగిన విధంగా స్పందించడం లేదని తెలంగాణ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేంద్ర మంత్రి నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు చేయడం లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

## బెంగళూరులో దారుణ ఘటన

### మాటుల కలిపి మహిళపై నలుగురు అత్యాచారం

### ఫిర్యాదుతో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**ఈ-కబురు,** బెంగళూరు: బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. కోరమంగళ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో 33 ఏళ్ల మహిళపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం జ్యోతి నివాస్ కాలేజీ జంక్షన్ వద్ద తాను వేచి ఉండగా.. దాదాపు 20 ఏళ్ల వయసు ఉన్న నలుగురు యువకులు వచ్చి తనతో మాటలు కలిపారని.. ఆ తర్వాత స్నేహంగా మెలిగి డిన్నర్‌కు ఆహ్వానించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. డిన్నర్ పూర్తయ్యాక ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి.. ఓ ప్రైవేటు హోటల్ టెర్రాస్‌పైకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం గురించి ఎవరికీ చెప్పొద్దని ఆమెను బెదిరించి.. శుక్రవారం ఉదయం 6గంటలకు విడిచిపెట్టారని పేర్కొన్నారు. ఉదయం ఇంటికి చేరుకున్నాక జరిగిన దారుణం గురించి భర్తకు వివరించగా.. పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ సారా ఫాతిమా మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 7.30 -8గంటల సమయంలో ఈ ఘటనపై తమకు సమాచారం అందిందన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నలుగురు నిందితులను అరెస్టు చేసి.. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిపారు. అయితే, ఆ యువకులతో ఆమె ఎందుకు వెళ్లారనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.



## సొంతిల్లు, వ్యాపారం దీర్ఘకాల లక్ష్యాలు

### ఆర్థిక స్వేచ్ఛ కూడా మిలీనియల్స్ టాప్-3 ప్రాధాన్యం వీటికే

### ఓ ప్రైవేటు అధ్యయనంలో వెల్లడి

**ఈ-కబురు,ముంబై:** సొంతిల్లు సమకూర్చుకోవడం, వ్యాపారం ప్రారంభించడం, ఆర్థిక స్వేచ్ఛ.. మిలీనియల్స్ (1980-1996 మధ్య జన్మించినవారు) టాప్-3 దీర్ఘకాలిక ప్రాధాన్యతలుగా ఉన్నాయి. 'ఫైబ్-మిలీనియల్ అప్‌గ్రేడ్ ఇండెక్స్' నిర్వహించిన అధ్యయనంలో ఈ ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. మెట్రోలు, నాన్ మెట్రో పట్టణాల్లో 8,000 మంది వ్యక్తుల అభిప్రాయాలను ఈ అధ్యయనంలో భాగంగా తెలుసుకున్నారు.

**ముఖ్యమైన అంశాలు..**

30 ఏళ్లలోపు వయసు వారిలో 41 శాతం మంది సొంతంగా ఇల్లు సమకూర్చుకోవడం తమ తొలి లక్ష్యంగా చెప్పారు. ఒంటరి పురుషులతో పోల్చితే, ఒంటరి మహిళల్లో సొంతంగా ఇల్లు కొనుగోలు చేయడం ఎక్కువ ప్రాధాన్య లక్ష్యంగా ఉంది. వ్యాపారం ప్రారంభించడం, దాన్ని వృద్ధి చేయడం 21 మంది లక్ష్యంగా ఉంది. దీర్ఘకాలంలో ఆర్థిక స్వేచ్ఛ సాధించడమే తమ లక్ష్యమని 19 శాతం మంది చెప్పారు. ఇక స్వల్పకాల లక్ష్యాలను గమనించినట్టయితే.. వృత్తిలో ఎదుగుదల, కొత్త గ్యాడ్జెట్, వాహనం కొనుగోలు, ఆరోగ్యం విషయంలో దృఢంగా ఉండాలని (కంటి సర్జరీలు, దంత చికిత్సలు తదితర) మిలీనియల్స్ కోరుకుంటున్నారు. పోటీ పెరగడంతో మంచి ఉద్యోగం సంపాదించే విషయంలో మెట్రోల్లోని మిలీనియల్స్ ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ఇలా భావిస్తున్నవారు 60 శాతంగా ఉన్నారు. తాము పొదుపు చేస్తామని, ఆర్థిక అంశాలకు వ్యూహాత్మకంగా ప్రణాళిక వేసుకుంటామని 39 శాతం మంది చెప్పారు. 21 శాతం మంది ఇతర ఆదాయ వనరుల కోసం అన్వేషిస్తామని చెబితే, దీర్ఘకాల లక్ష్యాల కోసం రుణ సాయం తీసుకుంటామని 29 శాతం మంది తెలిపారు. 15 శాతం మందిలో దీర్ఘకాల ఆర్థిక ప్రణాళిక లేనే లేదు. స్వల్పకాల ఆకాంక్షలను తీర్చుకునేందుకు ఫైనాన్షియల్ ఇనిస్ట్యూషన్స్ నుంచి రుణాలు తీసుకుంటామని చాలా మంది చెప్పారు. ఈ విషయంలో యువతరానికి మార్గదర్శనం అవసరమని ఈసర్వే నివేదిక అభిప్రాయపడింది. బాధ్యతాయుతమైన రుణాల దిశగా వారిని చైతన్యవంతం చేయాలని, తద్వారా తమ రుణ పరపతిని కాపాడుకుంటూనే కలలను సాకారం చేసుకోగలరని పేర్కొంది.




## ఓపెన్‌ఏఐ సీరియస్.. పలు చాట్‌జీపీటీ అకౌంట్లపై నిషేధం

**ఈ-కబురు,**ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ దిగ్గజం, చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. తమ చాట్‌జీపీటీ సేవల్ని దుర్వినియోగం చేస్తున్న చైనాకు చెందిన పలు ఖాతాలను నిషేధించింది. తమ ఏఐ నమూనాల దుర్వినియోగాన్ని నిరోధించడానికి, అనధికార నిఘా, పర్యవేక్షణకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసుకున్న తమ విధానాలను అవరోధం కలగకుండా కొనసాగిస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఓపెన్‌ఎఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**నిషేధానికి కారణాలివే..**

ఓపెన్‌ఏఐ విడుదల చేసిన థ్రెట్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం.. నిషేధిత ఖాతాలను సోషల్ మీడియా వినికిడి సాధనం కోసం వివరణలను రూపొందించడం కోసం వినియోగించారు. పాశ్చాత్య దేశాల్లో చైనా వ్యతిరేక నిరసనలపై రియల్ టైమ్ రిపోర్టులను చైనా భద్రతా సంస్థలకు అందించడానికి ఈ టూల్ ను రూపొందించారు. యునైటెడ్ స్టేట్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలలో నిరసనలను పర్యవేక్షిస్తున్న చైనా రాయబార కార్యాలయాలు, ఇంటెలిజెన్స్ ఏజెంట్లకు తమ సంగ్రహణలను పంపినట్లు ఆధారాలను ప్రూఫ్ రీడ్ చేయడానికి ఈ ఖాతాల నిర్వాహకులు ఓపెన్‌ఎఐ నమూనాలను ఉపయోగించారు.

**విధానాల ఉల్లంఘన**

వ్యక్తుల కమ్యూనికేషన్ నిఘా లేదా అనధికారిక పర్యవేక్షణ కోసం తమ ఏఐ సాధనాన్ని ఉపయోగించడాన్ని ఓపెన్‌ఏఐ విధానాలు కఠినంగా నిషేధిస్తున్నాయి. వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను అణచివేయడానికి ప్రయత్నించే ప్రభుత్వాలు, నియంతృత్వ పాలనల తరపున నిర్వహించే కార్యకలాపాలు ఇందులో ఉన్నాయి. నిఘా సాధనం కోసం కోడ్‌ను డీబగ్ చేయడానికి వినియోగదారులు ఓపెన్‌ఎఐ నమూనాలను కూడా ఉపయోగిస్తున్నారని దర్యాప్తులో తేలింది. అయితే ఈ సాధనం స్వయంగా నాన్-ఓపెన్‌ఎఐ మోడల్‌పై నడిచింది.

**మరో ఘటనలో..**

చైనా అసమ్మతివాది కై జియాను విమర్శిస్తూ వ్యాఖ్యలు చేయడానికి చాట్ జీపీటీని ఉపయోగించిన ఖాతాను కూడా ఓపెన్ ఏఐ నిషేధించింది. అదే సంస్థ స్పానిష్ లో యుఎస్ వ్యతిరేక వార్తా కథనాలను సృష్టించడానికి ఏఐని ఉపయోగించుకుంది. ఇవి తరువాత లాటిన్ అమెరికన్ అవుట్ లెట్ లలో ప్రచురితమయ్యాయి. అమెరికా వ్యతిరేక కథనాలతో లాటిన్ అమెరికన్ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రధాన స్రవంతి మీడియాలో ఒక చైనీస్ యాక్టర్ దీర్ఘకాలిక కథనాలను నాటడాన్ని ఓపెన్‌ఏఐ గమనించడం ఇదే మొదటిసారి.

# ఈవీ చార్జ్!

### స్పీడ్ బ్రేకర్లున్నా ఎలక్ట్రిక్ వెహికిల్స్ జోరు

### సాధారణ వాహనాలను మించిన వృద్ధి

### 2024లో రోడ్డెక్కిన 19,49,114 ఈవీలు



**ఈ-కబురు:** ఛార్జింగ్‌కు ఎక్కువ సమయం పట్టడం, ఒకసారి చార్జింగ్ చేస్తే ఎంత దూరం ప్రయాణిస్తుందోనన్న ఆందోళన, మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉండడం, వినియోగదారులకు భరోసా లేకపోవడం.. ఈ అంశాలే ఇప్పుడు ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) వృద్ధి వేగానికి ప్రధాన అడ్డంకులు. ఇదంతా నాణేనికి ఒకవైపు. మరోవైపు బ్యాటరీల సామర్థ్యం పెంచడానికి, వేగంగా చార్జింగ్ పూర్తి కావడానికి తయారీ సంస్థలు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయి. చార్జింగ్ మౌలిక వసతులు క్రమంగా విస్తరిస్తున్నాయి. దీంతో వినియోగదార్లలో ఈవీల పట్ల ఆమోదం క్రమంగా పెరుగుతోంది. ఇందుకు అమ్ముడవుతున్న ఈవీలే నిదర్శనం. దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో కలిపి 2024లో 2,61,07,679 యూనిట్ల వాహనాలు రోడ్డెక్కితే.. ఇందులో ఈవీలు 7.46 శాతం వాటాతో 19,49,114 యూనిట్లు కైవసం చేసుకున్నాయి. ఆసక్తికర అంశం ఏమంటే మొత్తం వాహన పరిశ్రమ గత ఏడాది 9.11 శాతం వృద్ధి చెందితే.. ఎలక్ట్రిక్ వాహన విభాగం ఏకంగా 27 శాతం దూసుకెళ్లడమే.

**రికార్డుల దిశగా..**

భారత్‌లో ఈవీ పరిశ్రమ 2024లో గరిష్ట విక్రయాలతో సరికొత్త రికార్డు సృష్టించింది. నిముషానికి 3.7 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2015%-%2024 కాలంలో 54 లక్షల యూనిట్ల ఈవీలు రోడ్డెక్కాయి. ప్రస్తుత వృద్ధి వేగాన్నిబట్టి ఈవీ రంగంలో 2029%-%30 నాటికి ప్యాసింజర్ కార్స్ విక్రయాలు 9.60 లక్షల యూనిట్లకు చేరవచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. అలాగే టూవీలర్స్ 1.37 కోట్ల యూనిట్లు, త్రీవీలర్స్ 12.8 లక్షల యూనిట్లను తాకుతాయని ఈవీ రంగం భావిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, నూతన సాంకేతికత, కంపెనీల దూకుడు.. వెరసి చార్జింగ్ స్టేషన్స్ సంఖ్య 13.2 లక్షలకు చేరవచ్చని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో 2024 డిసెంబర్ 20 నాటికి 25,202 చార్జింగ్ స్టేషన్స్ వినియోగంలో ఉన్నాయి. మొత్తం త్రిచక్ర వాహన అమ్మకాల్లో ఈ%-%త్రీవీలర్స్ వాటా ఏకంగా 56 శాతం ఉంది. 210 కంపెనీలు ఈ%-%టూవీలర్స్ విభాగంలో పోటీపడుతున్నాయి. డిసెంబర్ నెల అమ్మకాల్లో టూవీలర్స్ సెగ్మెంట్‌లో బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కో టాప్%-%2లో ఉన్నాయి. త్రీవీలర్స్‌లో మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ, బజాజ్ ఆటో, ప్యాసింజర్ వెహికిల్స్ విభాగంలో టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఐసీఈ విభాగాన్ని ఏలుతున్న దిగ్గజ కంపెనీలే ఈవీల్లోనూ పాగా వేస్తున్నాయి.

**వ్యయాలు తగ్గినప్పటికీ..**

ఐసీఈ ఇంజన్ కలిగిన వాహనాలతో పోలిస్తే ఈవీకి అయ్యే రోజువారీ వ్యయాలు తక్కువ. అయితే ప్రతిరోజు తక్కువ దూరం ప్రయాణించే వారికి ఈవీ చక్కని ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. అవసరం నిమిత్తం సుదూర ప్రయాణం చేయాల్సి వస్తే మాత్రం మరో మార్గం వెతుక్కోవాల్సిందే. ఐసీఈ వాహనాల మాదిరిగా దారిలో పెట్రోల్, డీజిల్ పోయించుకుని గమ్యం చేరినట్టు ఈవీలకు వీలు కాదు. ఒకవేళ ఈవీతో దూర ప్రయాణం చేయాల్సి వస్తే.. చార్జింగ్ కేంద్రాల వద్ద బ్యాటరీ చార్జింగ్ పూర్తి అయ్యే వరకు నిరీక్షించాల్సిందే. ఈ అంశమే ఈవీల వృద్ధి వేగానికి స్పీడ్ బ్రేకర్‌గా నిలిచింది. చార్జింగ్‌నుబట్టి ప్రయాణాలు ఆధారపడతున్నాయని కస్టమర్లు అంటున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల వృద్ధికి ఈ%-%కామర్స్ కంపెనీల దూకుడు కూడా తోడవుతోంది. కర్బన ఉద్గారాలను తగ్గించే దిశగా ఈ కంపెనీలు నడుం బిగించడం ఇందుకు కారణం. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ%-%కామర్స్ సంస్థలు, ఊబర్, ఓలా, రాపిడో వంటి అగ్రిగేటర్లూ, స్విగ్గీ, జొమాటో తదితర ఫుడ్ డెలివరీ యాప్స్, బిగ్‌బాస్కెట్, జెప్టో, బ్లింకిట్, డంజో వంటి క్విక్ కామర్స్ సంస్థలు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విషయంలో డెలివరీ పార్ట్‌నర్స్, డ్రైవర్ పార్ట్‌నర్స్‌ను ప్రోత్సహిస్తున్నాయి. సులభ వాయిదాల్లో ఈవీల కొనుగోలు, బ్యాటరీల స్వాపింగ్ సౌకర్యాలు, చార్జింగ్ మౌలిక వసతులను కల్పించేందుకు ముందుకు వస్తున్నాయి.

**వెన్నుదన్నుగా ప్రభుత్వం..**

ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) నుంచి కొత్తతరం ఈవీ, ఫ్లెక్స్ ఫ్యూయల్ టెక్నాలజీని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాలు, వాహన విడిభాగాల పరిశ్రమకు రూ.25,938 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను ప్రకటించింది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ స్టోరేజ్ విభాగానికి రూ.18,100 కోట్లు, పీఎం ఈ%-%డ్రైవ్ పథకానికి రూ.10,900 కోట్ల విలువైన ఇన్సెంటివ్స్ అందిస్తోంది. ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ఆటోమేటిక్ రూట్లో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతిస్తోంది. కనీసం 50 కోట్ల డాలర్ల పెట్టుబడితో ప్లాంట్లు స్థాపించే సంస్థలు పూర్తిగా తయారైన ఈవీలను దిగుమతి చేస్తే పన్ను 70%-%100 శాతం నుంచి కొత్త ఈవీ పాలసీలో 15 శాతానికి తగ్గించారు. లిథియం అయాన్ బ్యాటరీలపై పన్నును 21 నుంచి 13 శాతానికి చేర్చారు. ఈవీ, చార్జింగ్ మౌలిక వసతులు, బ్యాటరీస్ రంగంలో 2030 నాటికి 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెల్లువెత్తుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈవీ మార్కెట్ ఆరేళ్లలో ప్రపంచంలో తొలి స్థానాన్ని కైవసం చేసుకుంటుందని భారత ప్రభుత్వం ధీమాగా ఉంది. కొత్తగా అమ్ముడయ్యే వాహనాల్లో ఈవీల వాటా 2030 నాటికి 30 శాతం ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

**రీసేల్ వాల్యూ సవాల్..**

ఐసీఈ వాహనాల స్థాయిలో సెకండ్ హ్యాండ్ మార్కెట్లో ఈవీలకు డిమాండ్ లేకపోవడం కస్టమర్లను నిరాశకు గురిచేస్తోంది. రీసేల్ వాల్యూ పట్ల ప్రజల్లో ఉన్న ఆందోళన డిమాండ్‌ను పరిమితం చేస్తోందని కియా ఇండియా సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ హెడ్ హర్‌దీప్ సింగ్ బ్రార్ అన్నారు. జీఎస్టీ, రహదారి పన్ను ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. ఖరీదైన బ్యాటరీ కారణంగా ఐసీఈ వాహనంతో పోలిస్తే ఈవీ ధర ఎక్కువగా ఉంటోంది. ఈ అంశం కూడా ఈవీ స్వీకరణను పరిమితం చేస్తూనే ఉంది. ఈవీలు మరింత చవకగా మారితేనే డిమాండ్ ఊపందుకుంటుందన్నది కస్టమర్ల మాట. ఐసీఈ కార్ల కంటే ఎలక్ట్రిక్ కార్ల ధర 30%-%50% ఎక్కువ. అలాగే ద్విచక్ర వాహనాల ధర 20%-%30% అధికంగా ఉంటోంది.

# ఇళ్లు కట్టి.. ఈవీ చార్జింగ్ ఎక్కడ?

**ఈ-కబురు:**ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరిగిపోయింది.. మంచిదే..! శబ్ద, వాయు కాలుష్యంతో మానవాళికి ఉపద్రవంగా మారుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) వినియోగించాలని వినియోగదారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ఈవీ వాహనాల కొనుగోళ్లు, వినియోగంపై ప్రత్యేక రాయితీలు అందిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈవీ పాలసీని సైతం తీసుకొచ్చింది. అయితే వాహనాల కొనుగోళ్లకు రాయితీలు ఇస్తేనే సరిపోదు.. ఆయా వాహనాల చార్జింగ్ పాయింట్లు, స్టేషన్ల ఏర్పాటుపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ డెవలపర్లకు వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యత కూడా కాస్త ఎక్కువే. ప్రభుత్వం ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్న తరుణంలో.. బిల్డర్లు కూడా తమవంతు బాధ్యతగా భవన సముదాయాల్లోనే ఈవీ స్టేషన్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇక్కడే స్పష్టత లోపించింది. భవన సముదాయాల్లో ఎక్కడ ఈవీ స్టేషన్లు, పాయింట్లను ఏర్పాటు చేయాలనే దానిపై స్పష్టత కొరవడింది. బేస్‌మెంట్, సెల్లార్‌లోనా లేదా బయట ఓపెన్ స్పేస్‌లో ఈవీ స్టేషన్ ఏర్పాటు చేయాలా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయలేదు. దీంతో ఈవీ పాలసీ అమలులో ఉన్నా.. స్పష్టత లేకపోవడంతో స్టేషన్ల ఏర్పాటుకు బిల్డర్లు వెనుకంజ వేస్తున్నారు.



**బిల్డర్‌ను బాధ్యుడిని చేస్తే ఎలా?**

ప్రస్తుతం గృహ కొనుగోలుదారులు వారి అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా నివాస సముదాయాల్లో వసతులను కోరుకుంటున్నారు. పర్యావరణ స్పృహ పెరిగిన నేపథ్యంలో కస్టమర్లు వారు ఉండే చోటే ఈవీ చార్జింగ్ స్టేషన్ ఉండాలని అడుగుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిబంధనలు లేకపోవడంతో బిల్డర్లు పునరాలోచనలో పడుతున్నారు. ఒకవేళ సెల్లార్‌లో ఈవీ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే దానికి బిల్డర్‌ను బాధ్యులు చేస్తే ఎలా? అని సంశయంలో పడిపోతున్నారు.

**ఈవీపై స్పష్టత అవసరమే..**

సాధారణంగా బిల్డర్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసిన తర్వాత నివాస సముదాయాన్ని అసోసియేషన్‌కు అప్పచెబుతాడు. వారు ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను సరిగా నిర్వహణ చేయపోయినా, ఇతరత్రా కారణాల వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా? అని పలువురు డెవలపర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో నివాస సముదాయాల్లో ఈవీ స్టేషన్ల ఏర్పాటుపై స్పష్టమైన నిబంధనలు జారీ చేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ఉదాహరణకు గతంలో ప్రాజెక్ట్‌కు అగ్ని ప్రమాద శాఖ నిరభ్యంతర ధృవీకరణ పత్రం(ఎన్‌ఓసీ) వచ్చిందంటే ఇక ఆ ప్రాజెక్ట్ వంక అధికారులు చూసేవారు కాదు. కానీ, ఇప్పుడు ప్రతీ మూడేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలని కొత్త నిబంధనలను జోడించారు. ఇదే ఆహ్వానించదగ్గ పరిణామం. ఎందుకంటే ప్రాజెక్ట్‌ను అసోసియేషన్‌కు అప్పజెప్పిన తర్వాత నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ సేఫ్టీ ఉపకరణలు పనిచేయవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజా నిబంధనలతో నిర్వహణ సక్రమంగా ఉండటంతో పాటు క్రమంతప్పకుండా మాక్ డ్రిల్స్ చేస్తుంటారు. దీంతో ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంటుంది.



## ప్రేమ్ జీ ఇన్వెస్ట్.. తిరుగులేని పోర్ట్‌ఫోలియో

**ఈ-కబురు:** అజీమ్ ప్రేమ్ జీ ఫ్యామిలీ ఆఫీస్ ఇన్వెస్ట్ మెంట్ విభాగమైన ప్రేమ్ జీ ఇన్వెస్ట్ ఇన్వెస్ట్ మెంట్ ల్యాండ్ స్కేప్ లో తిరుగులేని సంస్థగా నిలదొక్కుకుంది. దీర్ఘకాలిక విలువ సృష్టిపై దృష్టి సారించిన ప్రేమ్‌జీ ఇన్వెస్ట్మెంట్ టెక్నాలజీ, హెల్త్ కేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ గూడ్స్ సహా వివిధ రంగాలకు చెందిన వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించింది.

**ఇన్వెస్ట్ మెంట్ ఫిలాసఫీ**

ప్రేమ్ జీ ఇన్వెస్ట్ దీర్ఘకాలంలో వ్యాపారాలను నిర్మించడం, మద్దతు ఇవ్వడంపై కేంద్రీకృతమైన స్పష్టమైన పెట్టుబడి తత్వంతో పనిచేస్తుంది. బలమైన వృద్ధి సామర్థ్యం ఉన్న కంపెనీలను గుర్తించడానికి, పెట్టుబడి పెట్టడానికి సంస్థ తన విస్తృతమైన నెట్‌వర్క్, లోతైన పరిశ్రమ నైపుణ్యాన్ని ఉపయోగిస్తుంది. 10 బిలియన్ డాలర్లకు పైగా ఎవర్ గ్రీన్ క్యాపిటల్ తో ప్రేమ్ జీ ఇన్వెస్ట్ ఇన్నోవేషన్ ను ప్రోత్సహించడానికి, సుస్థిర వృద్ధిని నడిపించడానికి కట్టుబడి పనిచేస్తోంది.కీలక పెట్టుబడులుటెక్నాలజీ: ప్రేమ్ జీ ఇన్వెస్ట్ ప్రముఖ ఐవేర్ రిటైలర్ లెన్స్ కార్ట్, టెక్ ఆధారిత సప్లై చైన్ ఫైనాన్సింగ్ కంపెనీ మింటిఫి సహా టెక్నాలజీ కంపెనీల్లో గణనీయమైన పెట్టుబడులు పెట్టింది. ఈ పెట్టుబడులు టెక్నాలజీ పరివర్తన శక్తి, ఆర్థిక వృద్ధిని నడిపించే సామర్థ్యంపై సంస్థ నమ్మకాన్ని ప్రతిబింబిస్తాయి.హెల్త్ కేర్: జీవన నాణ్యతను మెరుగుపరచడంలో, ఆర్థిక అభివృద్ధిని నడిపించడంలో ఈ రంగం కీలక పాత్రను గుర్తించిన ఈ సంస్థ హెల్త్ కేర్ కంపెనీల్లో కూడా పెట్టుబడులు పెట్టింది. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ హెల్త్ కేర్ పోర్ట్‌ఫోలియోలో మెడికల్ ఇన్నోవేషన్, పేషెంట్ కేర్‌లో ముందంజలో ఉన్న కంపెనీలు ఉన్నాయి.ఫైనాన్షియల్ సర్వీసెస్: డిజిటల్ కన్స్యూమర్ లెండింగ్ ప్లాట్ఫామ్ క్రెడిట్బీ, టెక్నాలజీ ఫస్ట్ వెల్త్ మేనేజ్మెంట్ ప్లాట్ఫామ్ డెజెర్వ్ వంటి కంపెనీల్లో పెట్టుబడులతో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టార్‌లో బలమైన ఉనికి ఉంది.కన్స్యూమర్ గూడ్స్: అధిక నాణ్యత కలిగిన ఉత్పత్తులు, సేవలకు పెరుగుతున్న డిమాండ్ ను గుర్తించిన ఈ సంస్థ కన్స్యూమర్ గూడ్స్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ కన్స్యూమర్ గూడ్స్ పోర్ట్ ఫోలియోలో ఆయా పరిశ్రమలలో అగ్రగామిగా ఉన్న, వృద్ధి, సృజనాత్మకతలో బలమైన ట్రాక్ రికార్డ్ ఉన్న కంపెనీలు ఉన్నాయి.తాజాగా 9 కంపెనీలలో షేర్ల కొనుగోలుప్రేమ్‌జీ ఇన్వెస్ట్ తాజాగా 9 కంపెనీలలో షేర్లు కొనుగోలు చేసింది. ఈ జాబితాలో భారతీ ఎయిర్‌టెల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితరాలున్నాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఇందుకు రూ. 446 కోట్లకుపైగా వెచ్చించింది. అనుబంధ సంస్థ పీఐ అపార్చునిటీస్ ఏఐఎఫ్‌వీ ఎల్‌ఎల్‌పీ ద్వారా ఎయిర్‌టెల్‌లో 5.44 లక్షల షేర్లు, జిందాల్ స్టీల్‌లో 9.72 లక్షల షేర్లు, రిలయన్స్‌లో 5.7 లక్షల షేర్లు, ఇన్ఫోసిస్‌లో 3.28 లక్షల షేర్లు సొంతం చేసుకుంది. ఈ బాటలో ఐసీఐసీఐ బ్యాంకులో 3.33 లక్షల షేర్లు, హిందాల్కోలో 8.13 లక్షల షేర్లు, అంబుజా సిమెంట్స్‌లో 5.14 లక్షల షేర్లు, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో 1.09 లక్షల షేర్లు, ఎస్‌బీఐ లైఫ్‌లో 84,375 షేర్లు చొప్పున కొనుగోలు చేసింది. ఒక్కో షేరునీ సగటున రూ. 477%-%1,807 ధరల శ్రేణిలో సొంతం చేసుకుంది. టారిష్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడింగ్ కంపెనీ ఈ వాటాలు విక్రయించింది.

## వాక్కాలుష్యం

**ఈ-కబురు:** మాటల గురించి చెప్పడమంటే, మాటలు కాదుగాని, మాటల గురించి కాస్త మాట్లాడుకుందాం. మాటలు రకరకాలు. ఇతరుల మనసులను గాయపరచే ఈటెల్లాంటి మాటలుబీ గాయపడ్డ మనసులకు ఊరటనిచ్చే ఊరడింపు మాటలుబీ ఎదుటివారిని మునగ చెట్టెక్కించే మెరమెచ్చు మాటలుబీ జనాలను ఇట్టే బోల్తా కొట్టించే బురిడీ మాటలుబీ సొంత డప్పు మోగించుకోవడంలో కోటలు దాటే మాటలుబీ కపటబుద్ధులాడే కల్లబొల్లి మాటలుబీ బుద్ధిహీనుల పొల్లు మాటలుబీ ఈర్ష్యాళువుల ద్వేషపు మాటలుబీ ఉబుసుపోవడానికి చెప్పుకొనే ఊకదంపుడు మాటలు%-% మాటల గురించి చెప్పుకోవాలంటే, ఇలా ఎన్ని మాటలైనా ఉంటాయి. మాటలాడే తీరును బట్టి మనిషిని అంచనా వేయవచ్చు. ఎంతటి స్ఫురద్రూపులైనా కావచ్చుబీ మరెంతటి నానాలంకారభూషితులైనా కావచ్చుబీ భాషణ నైపుణ్యం కొరవడితే మాత్రం ఎన్ని ఆభరణాలను దిగేసుకున్నా, ఎన్ని అలంకారాలు చేసుకున్నా, ఎవరూ పట్టించుకోరు. 'కేయూరాణి న భూషయంతి పురుషం హారాః న చంద్రోజ్జ్వలాః/ న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః/ వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే/ క్షీయంతేఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణం' అన్నాడు భర్తృహరి.ఇదే శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి 'భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగద తార హారముల్/ భూషిత కేశ పాశ మృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్/ భూషలు గావు పురుషుని భూషితు జేయు పవిత్రవాణి వా/గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించునన్నియున్' అని తెలుగులోకి అనువదించాడు. మనకు 'వేషభాషలు' అనే పదబంధం ఉంది.

ఈ-కబురు
24-2-2025
సోమవారం
e-kaburu.com


## 'నాటు నాటు' కు అఖిల్ స్టెప్పులు





హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు హీరోల కుటుంబాలు ఫ్రీ టైమ్‌ను ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దుబాయ్ వేదికగా జరుగుతున్న సన్నిహితుల పెళ్లి వేడుకలో హీరోలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా దిగిన ఫొటోలను నమ్రత ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు.'కీర్తి, నితేశ్ తమ అందమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. జీవితాంతం వాళ్లు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. నమ్రత షేర్ చేసిన ఫొటోల్లో ఎన్టీఆర్, ఆయన సతీమణి లక్ష్మి ప్రణతి, ఉపాసన, అమల తదితరులు ఉన్నారు. ఈ వేడుకల్లో అనిరుధ్ పెర్ఫార్మెన్స్‌తో ఉర్రూతలూగించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. నటుడు అఖిల్ స్నేహితులతో కలిసి నాటు నాటు పాటకు స్టెప్పులేశారు. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.



## పీపుల్స్ స్టార్ ట్యాగ్ గురించి తెలియదు

హైదరాబాద్: నటుడు సందీప్ కిషన్, రీతు వర్మ జంటగా నటిస్తున్న చిత్రం మజాకా. ఈ మూవీని దర్శకుడు త్రినాధరావు తెరకెక్కిస్తున్నాడు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. చిత్రం నుంచి తాజాగా మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ మూవీతో పీపుల్స్ స్టార్ అనే ట్యాగ్‌ను తగిలించుకున్నాడు సందీప్ కిషన్. ఈ విషయం సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చకు దారితీసింది. దర్శకుడు ఆర్.నారాయణమూర్తి ట్యాగ్‌ను మీరు ఎలా వాడుకుంటున్నారు అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. తాజాగా ఇదే విషయంపై సందీప్ కిషన్‌ని ప్రశ్నించగా, సందీప్ మాట్లాడుతూ.. ఆర్.నారాయణ మూర్తికి ఆ ట్యాగ్ ఉందని తనకు తెలియని, తాను ట్యాగ్‌లపై ఫోకస్ పెట్టేవాడిని కాదన్నారు. ఈ ట్యాగ్ తనకు పెట్టిన తర్వాత మూర్తికి ఆ ట్యాగ్ ఉన్న విషయం తనకు తెలిసింది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏం చేయాలో తాము ఆలోచిస్తామని సందీప్ కిషన్ చెప్పుకొచ్చాడు.

## ఛాన్స్ వస్తే ముద్దు సీన్స్ చేస్తా

హైదరాబాద్: సినీ ఇండస్ట్రీలో ఆనతి కాలంలోనే హీరోయిన్ రీతూ వర్మ మంచి పేరు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ హిట్ మూవీల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంది. షార్ట్ మూవీలతో కెరీర్ మొదలు పెట్టింది. తక్కువ సమయంలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. పెళ్లి చూపులు సినిమాతో మంచిపేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఎప్పుడు అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించలేదు. ప్రస్తుతం రీతూ వర్మ, హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా మూవీలో నటిస్తోంది. మజాకా సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆన్‌స్క్రీన్ ముద్దు సన్నివేశాలకు తాను వ్యతిరేకం కాదన్నారు. ఒకవేళ స్టోరీ డిమాండ్ చేస్తే హగ్, కిస్ సీన్లలో నటించడాని సిద్ధమేనని చెప్పారు. ముద్దు సన్నివేశాలకు సంబంధించిన చిత్రాల్లో తనకు అవకాశం రాలేదన్నారు. కథ డిమాండ్ చేస్తే అలాంటి సన్నివేశాల్లో నటించడానికి తాను ఏమాత్రం ఇబ్బంది పడనని స్పష్టం చేశారు.







## హీరో అజిత్‌కు తప్పిన ప్రమాదం

హైదరాబాద్: కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్‌కు పెను ప్రమాదం తప్పింది. స్పెయిన్‌లో జరుగుతున్న రేసింగ్‌లో ఆయన కారు ప్రమాదానికి గురైంది. మరో కారును తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో అజిత్ వాహనం ట్రాక్‌పై పల్టీలు కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆయన సురక్షితంగా బయటకు వచ్చారు. సిబ్బంది అప్రమత్తమయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను అజిత్ రేసింగ్ టీమ్ ఇన్‌స్టా వేదికగా షేర్ చేసింది. ఆయన క్షేమంగా ఉన్నారని తెలియజేసింది. ఈ ప్రమాదంలో హీరో తప్పు ఏమీ లేదని, ఇతర కార్ల వల్లే ఈ ఘటన జరిగిందని తెలిపింది. ప్రమాదం జరిగిన కొంత సమయానికి ఆయన బయటకు వచ్చి.. అభిమానులతో ఫొటోలు దిగారు. రేస్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, ఈ ప్రమాదం వీడియో చూసిన అభిమానులు.. అప్రమత్తంగా ఉండమని హీరోకు సూచిస్తున్నారు.

## జయహో భారత్




నేషనల్ బ్యూరో: ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. టార్గెట్‌ను టీమ్ఇండియా 42.3 ఓవర్లలో వికెట్లు 4 కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లి (100★; 111 బంతుల్లో 7 ఫోర్లు) బౌండరీ బాది శతకం పూర్తి చేసుకోవడంతో మ్యాచ్‌ను ముగించాడు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్, ఖుల్‌దిష్ షా ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాక్‌పై ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ఈ గెలుపుతో భారత్ దాదాపు సెమీస్ చేరగా, పాక్ నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి.

## తనయుడితో కలిసి ద్రవిడ్ క్రికెట్



నేషనల్ బ్యూరో: క్రికెట్‌లో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. తండ్రి, కొడుకు ఇద్దరూ కలిసి ఒకే మ్యాచ్‌లో బరిలోకి దిగారు. వారు ఎవరో కాదు కాదు భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ అతని కొడుకు అన్వయ్. కర్ణాటక మూడో డివిజన్ టోర్నీలో కలిసి ఇద్దరూ ఆడారు. విజయ్ క్రికెట్ క్లబ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ద్రవిడ్ ఆరో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి 10 పరుగులు చేయగా, అన్వయ్ (58) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరికి తోడు స్వప్నిల్ (50 బంతుల్లో 107, 12ఫోర్లు, 4సిక్స్‌లు) సెంచరీతో విజయ్ క్రికెట్ క్లబ్ 345 స్కోరు చేసింది. అన్వయ్ నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అయినా క్రికెట్‌లో ఇది కొత్తేం కాదు.

## స్పెషల్ అట్రాక్షన్‌గా బుమ్రా

నేషనల్ బ్యూరో: ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా జరిగిన భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు టీమిండియా స్టార్ పేసర్ బుమ్రా. మ్యాచ్‌కే స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. ప్రత్యేక అతిథిగా హాజరైన అతడు తన జట్టు ఆటగాళ్లకు కలిసి ఆల్ ది బెస్ట్ చెప్పాడు. మ్యాచ్‌కు హాజరైన జస్ప్రిత్ బుమ్రా తాను గెలుచుకున్న ఐసీసీ అవార్డులను మైదానంలో ఐసీసీ చైర్మన్ జైషా చేతుల మీదుగా అందుకున్నాడు. మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, మెన్స్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాలను దక్కించుకున్నాడు. మెన్స్ టెస్ట్ టీమ్ ఆఫ్ ది ఇయర్, మెన్స్ టీ20 ఆఫ్ ది ఇయర్ క్యాప్‌లను అందుకున్నాడు. 2024లో అద్భుత ప్రదర్శన చేసినందుకు ఐసీసీ అవార్డులను బుమ్రాకు అందజేసింది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వైట్ షర్ట్‌లో కనిపించాడు. మైదానంలో అతడు తన సహ క్రికెటర్లతో ముచ్చటిస్తూ స్టైలిష్‌గా ఆకట్టుకున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## తొలి ఓవర్లో షమీ చెత్త గణాంకాలు



నేషనల్ బ్యూరో: ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్‌తో మ్యాచ్ ప్రారంభంలోనే భారత్ ఓ రికార్డును సృష్టించింది. తొలుత టాస్ వేయగా పాక్ కెప్టెన్‌ను అదృష్టం వరించింది. టాస్ గెలిచిన పాక్ బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ వన్డే ఫార్మాట్‌లో వరుసగా టాస్‌లు ఓడిపోవడం ఇది 12వ సారి. అంతకుముందు నెదర్లాండ్స్ జట్టు వరుసగా 11 మ్యాచ్‌ల్లో టాస్ కోల్పోయింది. ఇండియా పేసర్ మహమ్మద్ షమీ కూడా అనుకోని ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకొన్నాడు. వన్డే ఇంటర్నేషనల్‌లో సుదీర్ఘమైన ఓవర్ వేసిన బౌలర్లలో మూడో స్థానంలో నిలిచాడు. తొలి ఓవర్‌లో ఐదు వైడ్‌బాల్స్ వేశాడు. ఆరు పరుగులు ఇచ్చాడు. భారత్ తరఫున ఒక ఓవర్‌లో ఇన్ని బంతులు వేసిన వారి జాబితాలో అంతకు ముందు జహీర్ ఖాన్, ఇర్ఫాన్ పఠాన్‌లు ఉన్నారు. ఈ రికార్డులో అగ్రస్థానంలో బంగ్లాదేశ్‌కు చెందిన హసిబుల్ హుస్సేన్, జింబాబ్వేకు చెందిన తినస్యే పన్యాంగర ఉన్నారు. వీరు ఓవర్‌లో 13 బంతులు చొప్పున విసిరారు.